



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 179 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 10 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 179 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 10 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## హైదరాబాద్ ట్రాఫిక్‌లో చిక్కుకున్న చంద్రబాబు కాన్వాయ్

- ప్రధాని మోదీ పర్యటన ట్రయల్ రన్‌తో ఇబ్బందులు
- బంజారాహిల్స్‌లో 10 నిమిషాలు ఆగిన కాన్వాయ్
- ట్రాఫిక్ కారణంగా కారు నుంచి కిందకు దిగిన ముఖ్యమంత్రి
- సమాచార లోపమే కారణమని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన కాన్వాయ్‌తో హైదరాబాద్ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు నిర్వహిస్తున్న ట్రయల్ రన్ కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. నగరంలోని బంజారాహిల్స్ ప్రాంతంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లలో భాగంగా పోలీసులు బంజారాహిల్స్ మార్గంలో కాన్వాయ్ ట్రయల్ రన్ చేపట్టారు. అయితే, కమ్యూనికేషన్ గ్యాప్ కారణంగా అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ అటువైపుగా వచ్చింది. దీంతో ఆయన

- మిగతా 2లో



## విశాఖలో 102 కి.మీ. మేర సెమీ రింగురోడ్డు

పెన్ పవర్ డెస్క్: రానున్న 50 ఏళ్లలో విశాఖ నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సెమీ రింగురోడ్డు నిర్మిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ అన్నారు. రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర రింగు రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు. వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్‌పై మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి అధికారులతో నారాయణ సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. “నగరం అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ అవసరం. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించాం. మాస్టర్‌ప్లాన్ అంశంలో వచ్చిన వినతులపై ఈ సమావేశంలో చర్చించాం. ఎమ్మెల్యేల నుంచి

- మిగతా 2లో

# ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి లోకేశ్

- ఏపీ ప్రభుత్వ సలహాదారు వేమూరు రవికుమార్ తనయుడి వివాహ వేడుకకు హాజరైన మంత్రి నారా లోకేష్
- విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి లోకేష్
- మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అధికారులు
- ఏపీ ప్రభుత్వ సలహాదారు వేమూరు రవికుమార్ కుమారుడి వివాహానికి హాజరు
- నూతన వధూవరులు కిరణ్, పుష్పలతలను ఆశీర్వదించిన మంత్రి
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచన



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శనివారం విజయవాడలో పర్యటించారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏపీ ప్రభుత్వ సలహాదారు, ఏపీఎన్ఆర్టీ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వేమూరు రవికుమార్ కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్నారు.

శనివారం ఉదయం ఇంద్రకీలాద్రికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిషనర్ రామచంద్ర మోహన్, ఈవో సీనా నాయక్, బోర్డు ఛైర్మన్ బోరా రాధాకృష్ణ తదితరులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు లోకేష్‌కు వేదాశీర్వచనం అందించారు. అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు.ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలోనే జరిగిన వేమూరు రవి కుమార్ కుమారుడు కిరణ్, పుష్పలతల వివాహ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. తన పర్యటనపై మంత్రి లోకేష్ స్పందిస్తూ, అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులతో మాట్లాడిన మంత్రి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## పవన్ కల్యాణ్ సీఎం స్థాయి నేత.. కానీ బీజేపీతో చేరింది అందుకే!

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తనకు సానుకూల దృక్పథం ఉందన్న ఉండవల్లి
- బీజేపీతో పవన్ చేరడం రాజకీయ అవసరమేనని వ్యాఖ్య
- జగన్‌ను గద్దె దించాలనే ఉద్దేశంతోనే పవన్ కూటమికి మద్దతిచ్చారని విశ్లేషణ
- పవన్‌కు సనాతన ధర్మం కంటే కమ్యూనిస్ట్ సిద్ధాంతాలే ఎక్కువ తెలుసన్న ఉండవల్లి
- పవన్ కల్యాణ్ ఒక ముఖ్యమంత్రి స్థాయి నాయకుడని కితాబు

- మిగతా 2లో





# శ్రీశైలంలో యాత్రికులకు సైబర్ నేరగాళ్ల టోకరా

పెన్ పవర్ డెస్క్: శ్రీశైలంలో సైబర్ మోసం వెలుగు చూసింది. ఢిల్లీకి చెందిన ఆనంద్‌కుమార్ శ్రీశైలం మల్లికార్జున సదన్‌లో 9 ఏసీ గదులను ఓ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకున్నారు. ఇందుకోసం పేటీఎం ద్వారా రూ.15 వేలు చెల్లించారు. శనివారం 27 మంది ఢిల్లీవాసులు హైదరాబాద్ నుంచి ఓ టూరిస్ట్ బస్సులో శ్రీశైలం వచ్చారు. మల్లికార్జున సదన్‌లో గదుల కోసం సంప్రదించగా అక్కడ గదుల బుకింగ్ జరగలేదని తెలిసింది. దీంతో మోసపోయినట్లు బాధితులు గుర్తించారు. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల యాత్రికులను లక్ష్యంగా చేసుకొని నకిలీ వెబ్‌సైట్లతో సైబర్ నేరగాళ్లు ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

సైబర్ మోసంపై స్పందించిన దేవస్థానం ఈవో ఢిల్లీ యాత్రికులకు జరిగిన సైబర్

- మిగతా 2లో





## పవన్ తో సినిమా తీయాలనేది నా కోరిక

- పవన్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఆయనతో భారీ చిత్రాన్ని నిర్మిస్తానన్న బాలినేని
- తప్పిదాలను ప్రశ్నించినందుకు వైసీపీలో ఇబ్బందులు ఎదుర్కొన్నానని వెల్లడి
- తనకు పదవుల మీద ఆశ లేదని పవన్‌కు చెప్పానన్న బాలినేని

పెన్ పవర్ డెస్క్:జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ఒక సినిమా నిర్మించాలనేది తన చిరకాల కోరిక అని మాజీ మంత్రి

- మిగతా 2లో

## ఒక్క రోజులోనే డీఎంకేతో బంధాన్ని తెంచుకుని కాంగ్రెస్ వెళ్లిపోయింది: స్టాలిన్ ఆవేదన

- టీవీకేకు మద్దతిచ్చిన కాంగ్రెస్‌పై స్టాలిన్ అసహనం
- ఒక్క రోజులోనే బంధం తెంచుకుందని వ్యాఖ్య
- వెంట నిలిచిన మిత్రపక్షాలకు ప్రత్యేక కృతజ్ఞతలు
- కొత్త ప్రభుత్వం పాత పథకాలు కొనసాగించాలని విజ్ఞప్తి

- మిగతా 2లో



## తమిళనాడు సీఎంగా విజయ్... నేడు ప్రమాణ స్వీకారం

- తమిళనాడు రాజకీయాల్లో నాటకీయ పరిణామాలు
- టీవీకే పార్టీకి మద్దతు ప్రకటించిన వీసీకే, ఐయూఎంఎల్
- 120 సీట్ల బలంతో గవర్నర్ ను కలిసిన విజయ్
- విజయ్ తో భేటీ కోసం కేరళ పర్యటన రద్దు చేసుకున్న గవర్నర్
- నేడు చెన్నై నెహ్రూ స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రమాణ స్వీకారం



పెన్ పవర్ డెస్క్:తమిళ రాజకీయాల్లో కొద్దిరోజు లుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధినేత విజయ్, తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు మార్గం సుగమమైంది. (ఆదివారం) మధ్యాహ్నం 3 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు. ఈరోజు చోటుచేసుకున్న నాటకీయ పరిణామాల మధ్య, విజయ్ చెన్నైలోని లోక్‌భవన్‌లో ఇన్‌చార్జ్ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌తో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 120 మంది సభ్యుల

- మిగతా 2లో



## పెరగనున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధర?

- అంతర్జాతీయ మార్కెట్‌లో భారీగా పెరిగిన ముడిచమురు ధర
- బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి 126 డాలర్లకు చేరిన వైనం
- మే 15 లోపు ఇంధన ధరలు పెరిగే అవకాశం

పెన్ పవర్ డెస్క్:మన దేశంలో వాహన దారులపై పెట్రో ల్, డీజిల్ ధరల భారం

- మిగతా 2లో




## రిజిస్టర్డ్ అగ్రిమెంట్ లేకున్నా హక్కులుంటాయ్

### హోమ్‌బయర్లకు అండగా తెలంగాణ రేరా కీలక తీర్పు

- హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో కీలక తీర్పు
- నమోదు కాని ఒప్పందాలకూ రేరా రక్షణ
- ఆలస్యమైన ప్రాజెక్టులపై రేరా కొరడా
- 30 రోజుల్లో షెడ్యూల్ ఇవ్వాల్సిందేనని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్‌లో ఆలస్యమవుతున్న ఓ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ రేరా (TSRERA) సంచలన తీర్పు వెలువరించింది. రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ లేనంత మాత్రాన హోమ్‌బయర్లు తమ హక్కులను కోల్పోరని స్పష్టం చేసింది. గణనీయంగా డబ్బు చెల్లించి, ఫ్లాట్లను కేటాయించుకున్న

- మిగతా 2లో



## థాయ్‌లాండ్ గబ్బిలాల్లో కొత్త కరోనావైరస్..

### మానవులకు సోకే ప్రమాదం!

- థాయ్‌లాండ్ గబ్బిలాల్లో కొత్త కరోనావైరస్‌ను గుర్తించిన శాస్త్రవేత్తలు
- ఈ వైరస్ మానవులకు సోకే ప్రమాదం ఉందని పరిశోధనలో వెల్లడి
- ఈ వైరస్ కోవిడ్-19కు చెందిన సార్బెకోవైరస్ కుటుంబానికి చెందినది
- కోవిడ్-19 లాగే మానవ కణాల్లోకి ప్రవేశించే సామర్థ్యం దీనికి ఉంది
- ప్రస్తుతానికి మానవుల్లో ఎలాంటి కేసులు లేవని, ఆందోళన వద్దని సూచన

పెన్ పవర్ డెస్క్:థాయ్‌లాండ్ శాస్త్రవేత్తలు గబ్బిలాల్లో ఓ కొత్త రకం కరోనావైరస్‌ను గుర్తించారు. ఇది భవిష్యత్తులో మానవులకు సోకే ప్రమాదం ఉందని వారి పరిశోధనలో తేలింది. యూనివర్సిటీ ఆఫ్ టోక్యోతో సహా పలు అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# డీఎంకే విషయం కాంగ్రెస్ తప్పు చేసిందా?

రాజకీయాల్లో మార్పు అనివార్యం. అంతేనా.. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు.. శాశ్వత స్నేహితులు ఎవరూ ఉండరు. ఎవరికి వారు తమ రాజకీయ అవసరాలకు తగినట్లే వ్యవహరిస్తుంటారు. అదేమీ తప్పు కాదు. అందుకు ఏ రాజకీయ పార్టీ కూడా మినహాయింపు కాదు. దశాబ్దాల తరబడి డీఎంకేతో ఉన్న మిత్రత్వాన్ని పక్కన పెట్టేసి.. అధికారానికి దగ్గరగా ఉన్న విజయ్ కు మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ తీరుపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ తన బుద్ధిని చూపించిందని.. సరైన సమయాన్ని చూసి తన దారి తాను చూసుకుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక.. దశాబ్దాల తరబడి సాగుతున్న స్నేహాన్ని పక్కన పెట్టేసి.. విజయ్ తో కలవటాన్ని డీఎంకే జీర్ణించుకోలేకపోతోంది. తమతో స్నేహహస్తాన్ని వదిలేసిన హస్తం పార్టీపై పార్టీ చీఫ్ స్టాలిన్ సైతం సీరియస్ కావటం తెలిసిందే. కాంగ్రెస్ తో కలిసి చట్టసభలో పక్కపక్కనే కూర్చోవటానికి కూడా తమకు నచ్చలేదని.. తమకు వేరే వరుసలో కూర్చునేలా అనుమతి ఇవ్వాలని లోక్ సభ స్పీకర్ కు డీఎంకే నేత లేఖ రాయటం చూస్తే.. కాంగ్రెస్ తాజా నిర్ణయం డీఎంకును ఎంతటి ఆగ్రహానికి గురి చేసిందన్న విషయం అర్థమయ్యేలా చేస్తుందని చెప్పాలి.

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన మేజిక్ ఫిగర్ కు కేవలం పది మంది ఎమ్మెల్యేల దూరంలో ఉన్న విజయ్ కు.. కాంగ్రెస్ తనకున్న ఐదుగురు ఎమ్మెల్యేలను విజయ్ పార్టీకి మద్దతు ఇస్తారని ప్రకటించటం ద్వారా కొత్త స్నేహానికి తెర తీసింది. విజయ్ పార్టీకి వచ్చిన 108 స్థానాల తర్వాత డీఎంకే.. అన్నాడీఎంకేలను మినహాయిస్తే.. మిగిలిన పార్టీలకు దక్కిన సీట్లు ఒకట్రెండు స్థానాలే. వాటితో చూస్తే.. కాంగ్రెస్ చేతిలో ఉన్న ఐదుగురు ఎమ్మెల్యేలు కీలకమనే చెప్పాలి.విజయ్ కు తమ మద్దతును ప్రకటించటం ద్వారా కాంగ్రెస్ తప్పు చేసిందా? అన్నది ప్రశ్న. భవిష్యత్తు అవసరాల్ని పరిగణలోకి తీసుకుంటే కాంగ్రెస్ తెలివైన పని చేసిందనే చెప్పాలి. తాజా నిర్ణయంతో తన చిరకాల మిత్రుడు డీఎంకేకు కాంగ్రెస్ ఎందుకు హ్యాండిచ్చింది? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. తమిళ రాజకీయాల్లో సరికొత్త ఒరవడికి తెర తీశారు విజయ్. అతడి తీరు చూస్తే.. ఇవాళ వచ్చి రేపు.. ఎల్లుండో వెళ్లిపోయేలా లేదు. దీర్ఘకాలం రాజకీయాల్లో కొనసాగే వీలుంది. దీనికి తోడు స్టాలిన్ తర్వాత డీఎంకే భవిష్యత్తు ఏమిటన్న దానిపైనా పలు సందేహాలు ఉన్నాయి.

అన్నాడీఎంకేతో మొదట్నించి దూరంగా ఉంటున్నదే. ఇలాంటి వేళలో కొత్తగా రాజకీయాల్లోకి రావటం.. వచ్చి రావటంతోనే సంచలనానికి తెర తీయటం చూస్తే.. రానున్న రోజుల్లో విజయ్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని చెప్పక తప్పదు. సినీ నటుడిగా ఇంతకాలం వ్యవహరించిన విజయ్.. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోవటానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. పాలనతో తన మార్క్ చూపించి.. గత పార్టీల ప్రభుత్వానికి భిన్నంగా వ్యవహరిస్తే.. విజయ్ రాజకీయ భవిష్యత్తుకు తిరుగు ఉండదు. అదే సమయంలో కాంగ్రెస్ సైతం సరైన సమయంలో సరైన మిత్రుడి సహకారంతో తాను మరింత బలపడేందుకు అవకాశం దక్కుతుందని చెప్పాలి.

# పవన్ కల్యాణ్ సీఎం స్థాయి నేత.. కానీ బీజేపీతో చేరింది అందుకే!

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తనకు సానుకూల దృక్పథం ఉందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. అయితే, ఆయన రాజకీయ ప్రయాణం, సిద్ధాంతాలపై ఆసక్తికర విశ్లేషణ చేశారు. ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉండవల్లి మాట్లాడుతూ.. పవన్‌ను తాను ఇప్పటివరకు ఒకసారి మాత్రమే కలిశానని, పునర్విభజన అంశంపై మాట్లాడదామనుకున్నా ఆయన ఆసక్తి చూపలేదని తెలిపారు.

**బీజేపీతో పవన్ చేరడం రాజకీయ అవసరమే**

పవన్ కల్యాణ్ రాజకీయ వైఖరిని ఉండవల్లి విశ్లేషించారు. "చిన్నప్పుడు నక్సలైట్లలో చేరదామనుకున్నా" అని పవన్ చెప్పిన మాటలను గుర్తుచేస్తూ, 2019 ఎన్నికల్లో ఆయన కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేశారని ప్రస్తావించారు. ఆ తర్వాత బీజేపీతో చేరడం కేవలం రాజకీయ అవసరాల కోసమేనని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఎదురైన అవమానాలను భరించలేకే పవన్ ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చన్నారు. జగన్‌ను ఎలాగైనా గద్దె దించాలనే బలమైన ఆకాంక్షతోనే, చంద్రబాబు రాజమండ్రి జైల్లో ఉన్నప్పుడు వెళ్లి మద్దతు ప్రకటించారని, ఇది తనను తాను కాపాడుకోవడానికేనని తాను భావిస్తున్నట్లు ఉండవల్లి పేర్కొన్నారు.

**పవన్‌కు సనాతనం ఎక్కలేదు.. కమ్యూనిజమే ఇష్టం**

ఇటీవల పవన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలపైనా ఉండవల్లి స్పందించారు. "పవన్ కల్యాణ్‌కు సనాతనం ఎక్కిపోయిందని నేను అనుకోను. ఆయన కమ్యూనిస్ట్ సిద్ధాంతాలను ఎక్కువగా చదివారు. ఏ విషయాన్నైనా గట్టిగా చెబుతారు. ఆయన్ను కలిసినప్పుడు సనాతన ధర్మం గురించి తప్పక అడుగుతాను" అని అన్నారు.

పవన్ కల్యాణ్ ఒక ముఖ్యమంత్రి స్థాయి నాయకుడని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆయన పాత్ర ఎంతో కీలకమని ఉండవల్లి అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉంటే... తిరుమల లడ్డూలో కల్తీ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు 'గొడ్డు మాంసం' వంటి పదాలు వాడటం ప్రజల్లోకి సరైన సంకేతాలు పంపదని, ఇలాంటి విషయాల్లో చట్టం తన పని తాను చేసుకుపోవాలని సూచించారు.

# ఒక్క రోజులోనే డీఎంకేతో బంధాన్ని తెంచుకుని కాంగ్రెస్ వెళ్లిపోయింది: స్టాలిన్ ఆవేదన

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత నెలకొన్న రాజకీయ అనిశ్చితిపై డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందించారు. ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో, తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒక్క రోజులోనే డీఎంకేతో బంధాన్ని తెంచుకుని కాంగ్రెస్ పార్టీ వెళ్లిపోయిందని ఆవేదన వెలిబుచ్చారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు.

"నా ప్రాణంలో ప్రాణంగా కలిసిపోయిన ప్రియమైన సోదరులకు, నా ప్రాణ సమానులైన తమిళ ప్రజలకు నా ప్రేమపూర్వక నమస్కారాలు. ఎన్నికల ఫలితాలు ప్రకటించబడిన తర్వాత జరుగుతున్న పరిణామాలను మీరు చూస్తూనే ఉన్నారు. ఏ పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన మెజారిటీ రాని విధంగా శాసనసభ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయిలో ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) నేతృత్వంలోని లౌకిక ప్రగతిశీల కూటమికి సీట్లు రానప్పటికీ, మనం చెప్పుకోదగ్గ ఓట్లను సాధించాం. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు తాము అడ్డంకిగా ఉండబోమని, డీఎంకే నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందని నేను ఇదివరకే మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాను.

ఆ తర్వాత, నా అధ్యక్షతన జరిగిన శాసనసభ్యుల సమావేశంలో, తుది నిర్ణయం తీసుకునే బాధ్యతను నాకే అప్పగించారు. "పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, పార్టీ ముఖ్య నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటాను" అని ఆ సమావేశంలో వారికి తెలిపాను. ప్రభుత్వం ఏర్పాటుకు ఎవరికీ మెజారిటీ రాని ఈ పరిస్థితుల్లో, చాలా మంది ప్రత్యామ్నాయ ఆలోచనలు చెప్పారు. నా వరకు, మిత్రపక్షాలు ఏ నిర్ణయం తీసుకున్నా వారి నిర్ణయాన్ని గౌరవించి, సమన్వయంతో పనిచేసి, స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. మరో ఎన్నికలకు దారితీయకూడదన్నదే నా అభిప్రాయం.

"ప్రస్తుత సంక్షోభాన్ని నివారించేందుకు, మేము తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మద్దతు ఇస్తున్నప్పటికీ, విధానపరంగా డీఎంకే నేతృత్వంలోని లౌకిక ప్రగతిశీల కూటమిలోనే కొనసాగుతాం" అని మా కూటమిలోని మిత్రపక్షాలు ప్రకటించడాన్ని నేను స్వాగతిస్తున్నాను.

కూటమి తరపున పోటీ చేసి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపేందుకు అన్నా అరివాలయంకు రాలేదు. ఒకే రోజులో డీఎంకేతో బంధాన్ని తెంచుకుని కాంగ్రెస్ పార్టీ వెళ్లిపోయింది. అదే సమయంలో, కమ్యూనిస్ట్ నాయకులు, కామ్రేడ్ షణ్ముగం, కామ్రేడ్ వీరపాండియన్, విదుతలై చిరుత్తైగల్ కట్చి (వీసీకే) అధ్యక్షుడు తిరుమావళవన్ "తమిళనాడు హక్కుల కోసం, ప్రజల సంక్షేమం కోసం డీఎంకేతో కలిసి పోరాడతాం" అని ప్రకటించి స్నేహ భావాన్ని ప్రదర్శించారు. ఇది విధానాలలో బలంగా ఉన్న డీఎంకేపై వారికి ఉన్న నమ్మకాన్ని చూపుతుంది.

ఈ అత్యంత

కీలకమైన, క్లిష్ట సమయంలో మా వెంట నిలిచిన మిత్రపక్ష నేతలు ప్రొఫెసర్ అయ్య కాదర్ మొహిదీన్, అన్న వైగో, సోదరి ప్రేమలత విజయకాంత్, ప్రొఫెసర్ జవాహిరుల్లా, సోదరులు ఈశ్వరన్, తమీమున్ అన్సారీతో సహా అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. వారి నిబద్ధతకు ఎలాంటి కృతజ్ఞతలు, ప్రశంసలు అయినా సరిపోతాయి.గత ఐదేళ్లలో తమిళనాడును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రాన్ని సుసంపన్నం చేశాం. ఎన్నో పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేలా చేశాం. దూరదృష్టి, ప్రణాళికతో కూడిన ఆ పథకాలను ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం కూడా కొనసాగించాలన్నది నా వ్యక్తిగత అభిప్రాయం. మహిళలు, యువత, విద్యార్థులు, పిల్లలు, అణగారిన వర్గాలు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉద్దేశించిన అన్ని పథకాలను కొనసాగిస్తే ప్రజలకు మేలు జరుగుతుంది, రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రభుత్వం పనిచేయాలని కోరుకుంటున్నాను.

ఏర్పడబోయే కొత్త ప్రభుత్వానికి మరోసారి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అంటూ స్టాలిన్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# థాయ్‌లాండ్ గబ్బిలాల్లో కొత్త కరోనావైరస్.. మానవులకు సోకే ప్రమాదం!

- మొదటి పేజి తరువాయి

జరిగిన ఈ కీలక అధ్యయనం, ప్రముఖ సైన్స్ జర్నల్ 'సెల్'లో ప్రచురితమైంది.

**పరిశోధనలో ఏం తేలింది?**

ఈ కొత్త వైరస్... కోవిడ్–19 మహమ్మారికి కారణమైన SARS-CoV-2, గతంలో విజృంభించిన SARS-CoV-1 వైరస్‌ల కుటుంబమైన 'సార్బెకోవైరస్'కు చెందినది. ఇది మానవ కణాల్లో ఉండే ACE2 రిసెప్టర్‌లకు అతుక్కునే సామర్థ్యాన్ని కలిగి ఉందని పరిశోధకులు కనుగొన్నారు. SARS-CoV-2 కూడా ఇదే మార్గం ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఈ లక్షణం వల్లే దీనిపై ఆందోళన వ్యక్తమవుతోంది.

అయితే, ఇప్పటివరకు ఈ వైరస్ మానవులకు సోకినట్లు ఎక్కడా ఆధారాలు లేవని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఇది కేవలం శాస్త్రీయంగా గుర్తించిన ఒక సంభావ్య ముప్పు మాత్రమేనని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. జంతువుల నుంచి మానవులకు వైరస్‌లు వ్యాపించే (జూనోటిక్) ప్రమాదాలను ముందుగానే పసిగట్టేందుకే ఈ పరిశోధనలు చేస్తున్నట్లు వివరించారు.

**నిఘా ఎందుకు అవసరం?**

గబ్బిలాలు అనేక రకాల వైరస్‌లకు సహజ ఆశ్రయాలుగా ఉంటాయి. వాటిపై నిరంతరం నిఘా పెట్టడం ద్వారా కొత్త ఆరోగ్య ముప్పులను ముందుగానే గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

కోవిడ్–19 మహమ్మారి తర్వాత వన్యప్రాణుల్లోని వైరస్‌లపై ప్రపంచవ్యాప్తంగా పర్యవేక్షణ పెరిగింది. భవిష్యత్ మహమ్మారులను నివారించడానికి ఇలాంటి ముందస్తు హెచ్చరికలు, అంతర్జాతీయ శాస్త్రీయ సహకారం ఎంతో కీలకమని ఈ అధ్యయనం గుర్తుచేస్తోంది.

# రిజిస్టర్డ్ అగ్రిమెంట్ లేకున్నా హక్కులుంటాయ్

- మొదటి పేజి తరువాయి

వారు 'అలాటీ'లుగానే పరిగణించబడతారని, వారి ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత డెవలపర్‌పై ఉందని తేల్చిచెప్పింది. హైదరాబాద్ కొంపల్లిలో ఓ సంస్థ నిర్మిస్తున్న ప్రాజెక్టులో ఫ్లాట్లు కొనుగోలు చేసిన పలువురు బాధితులు రేరాను ఆశ్రయించారు. 2020–22 మధ్య ఫ్లాట్లు బుక్ చేసుకున్నామని, రెండు, మూడేళ్లలో ఇస్తామన్న డెవలపర్ ఐదేళ్లు గడిచినా నిర్మాణం పూర్తి చేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్మాణం నెమ్మదిగా సాగుతోందని, డబ్బు వాపసు అడిగినా ఇవ్వడం లేదని వాపోయారు.ఈ ఫిర్యాదులపై విచారణ సందర్భంగా డెవలపర్ తన వాదన వినిపించారు. కొందరు కొనుగోలుదారులతో అధికారికంగా సేల్ అగ్రిమెంట్లు లేనందున వారు అలాటీలు (ఫ్లాట్ అలాట్ మెంట్ పొందినవారు) కాదని పేర్కొన్నారు. మరికొన్ని ఒప్పందాలు అసంపూర్తిగా ఉన్నాయని, ఇంకొందరు పెట్టుబడిదారులు మాత్రమేనని, ఇది సివిల్ వివాదం కిందకు వస్తుందని వాదించారు.డెవలపర్ వాదనలను తెలంగాణ రేరా తోసిపుచ్చింది. రేరా చట్టంలోని సెక్షన్ 2(ఎ) ప్రకారం, డబ్బు చెల్లించిన రసీదులు, అలాట్‌మెంట్ పత్రాలు ఉన్నందున వారంతా అలాటీలేనని స్పష్టం చేసింది. రిజిస్టర్డ్ ఒప్పందం లేకపోవడం హక్కులను నిరాకరించడానికి కారణం కాదని తేల్చిచెప్పింది. వెంటనే ప్రాజెక్టును పూర్తి చేసి, 30 రోజుల్లో దశలవారీగా నిర్మాణ షెడ్యూల్‌ను కొనుగోలుదారులకు అందించాలని ఆదేశించింది. అనుమతులు లేకుండా నిర్మించిన ఫ్లోర్లలోని వారికి 30 రోజుల్లోగా ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా ప్రత్యామ్నాయ ఫ్లాట్లు కేటాయించాలని, లేనిపక్షంలో పూర్తి డబ్బు వాపసు చేయాలని తీర్పులో పేర్కొంది.

బుకింగ్ సమయంలో ఇచ్చిన 36 నెలల గడువుకు చట్టబద్ధమైన ప్రాధాన్యత ఉంటుందని రేరా నొక్కిచెప్పింది. ఈ తీర్పు, నమోదు కాని ఒప్పందాలను సాకుగా చూపి తప్పించుకోవాలనుకునే డెవలపర్లకు చెక్ పెడుతూ, హోమ్‌బయర్ల హక్కులకు మరింత బలాన్ని చేకూర్చింది.

# తమిళనాడు సీఎంగా విజయ్... నేడు ప్రమాణ స్వీకారం

- మొదటి పేజి తరువాయి

మద్దతు తనకు ఉందని, ఇందుకు సంబంధించిన లేఖలను ఆయన గవర్నర్‌కు సమర్పించారు. విజయ్‌తో భేటీ కోసమే గవర్నర్ తన కేరళ పర్యటనను రద్దు చేసుకోవడం గమనార్హం. ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి విజయ్ గవర్నర్‌ను కలవడం ఇది నాలుగోసారి.తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 స్థానాలు ఉండగా, ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది సభ్యుల మద్దతు (మ్యాజిక్ ఫిగర్) అవసరం. ప్రస్తుతం టీవీకే బలం 120కి చేరడంతో, విజయ్ ముఖ్యమంత్రి కావడం లాంఛనమే అయింది. ఇవాళ వీసీకేతో పాటు ఐయూఎంఎల్ కూడా టీవీకే పార్టీకి మద్దతు ప్రకటించడం విశేషం. విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించేందుకు అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా టీవీకే శ్రేణులు, అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. పలుచోట్ల బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# విశాఖలో 102 కి.మీ. మేర సెమీ రింగురోడ్డు

- మొదటి పేజి తరువాయి

అందిన వినతుల్లో 90 శాతం పరిష్కరించాం. 6,836 చదరపు కి.మీ పరిధిలో వీఎంఆర్డీఏ విస్తరించి ఉంది. ఈనెల చివరి నాటికి సెమీ రింగురోడ్డు డీపీఆర్ సిద్ధమవుతుంది. భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఏడు కనెక్టింగ్ రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు పూర్తయ్యాయి. భోగాపురం ఎయిర్‌పోర్టుకు బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. రూ.14వేల కోట్లతో తాగునీటి ప్రాజెక్టు వస్తోంది. ఇది పూర్తయితే 95 శాతం ఇళ్లకు తాగునీరు అందుతుంది" అని మంత్రి నారాయణ వివరించారు. మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ ఎకనామిక్ కారిడార్ ఆధారంగా సమీక్ష సమావేశం జరిగిందని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మారుతోందన్నారు.

# హైదరాబాద్ ట్రాఫిక్‌లో చిక్కుకున్న చంద్రబాబు కాన్వాయ్

- మొదటి పేజి తరువాయి

వాహనశ్రేణి ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడి, సుమారు 10 నిమిషాల పాటు ట్రాఫిక్‌లోనే నెమ్మదిగా కదులుతూ ఉండిపోయింది. ట్రాఫిక్ జామ్ తీవ్రంగా ఉండటంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు తన కారు నుంచి కిందకు దిగారు. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ట్రాఫిక్‌ను క్లియర్ చేసే ప్రయత్నం చేశారు. కొద్దిసేపటి తర్వాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో చంద్రబాబు కాన్వాయ్ అక్కడి నుంచి ముందుకు కదిలి వెళ్లిపోయింది. ఉన్నతాధికారుల మధ్య సమాచార లోపం వల్లే ఈ గందరగోళం తలెత్తినట్లు తెలుస్తోంది.

# పవన్ తో సినిమా తీయాలనేది నా కోరిక

- మొదటి పేజి తరువాయి

బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. పవన్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఆయన హీరోగా ఒక భారీ చిత్రాన్ని నిర్మించడానికి తాను సిద్ధంగా ఉన్నానని తన మనసులోని మాటను బయటపెట్టారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను ప్రశ్నించినందుకే తాను ఆ పార్టీలో ఇబ్బందులు ఎదుర్కొన్నానని బాలినేని సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో ఉంటూనే తప్పులను ఎత్తిచూపడం వల్ల తన మంత్రి పదవిని కూడా కోల్పోవాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతుకకు జనసేన సరైన వేదిక అని భావించే తాను ఆ పార్టీలో చేరానని స్పష్టం చేశారు.జనసేనలో చేరే ముందే పవన్ కల్యాణ్‌కు తన ఉద్దేశాన్ని స్పష్టంగా చెప్పానని ఆయన తెలిపారు. తనకు ఎలాంటి పదవుల మీద ఆశ లేదని, కేవలం పార్టీ బలోపేతం కోసం ఒక సామాన్య కార్యకర్తలా పనిచేస్తానని పవన్‌కు హామీ ఇచ్చానని చెప్పారు.

# శ్రీశైలంలో యాత్రికులకు సైబర్ నేరగాళ్ల టోకరా

- మొదటి పేజి తరువాయి

మోసంపై శ్రీశైలం ఆలయ ఈవో శ్రీనివాసరావు స్పందించారు. యాత్రికులకు అండగా నిలిచారు. వారికి ఉచిత వసతి, భోజనం, దర్శన ఏర్పాట్లు చేయించారు. భక్తుల నుంచి లిఖితపూర్వక ఫిర్యాదును దేవస్థానం పీఆర్‌వో తీసుకున్నారు. సైబర్ నేరగాళ్ల మోసం కేసు పెట్టాలని ఈవో శ్రీనివాసరావు నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు దేవస్థానం తరపున తమకు ఉచిత వసతి, దర్శనం, భోజన ఏర్పాట్లు చేసిన ఈవో, సిబ్బందికి యాత్రికులు కృతజ్ఞతలు తెలిపారు

# పెరగనున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధర?

- మొదటి పేజి తరువాయి

పడే సూచ నలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీగా పెరగడంతో, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఎదుర్కొంటున్న నష్టాల నేపథ్యంలో మే 15 లోపు ఇంధన ధరల పెంపు తప్పకపోవచ్చని తెలుస్తోంది.

అంతర్జాతీయంగా ముడిచమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుండి ఏకంగా 126 డాలర్లకు చేరుకోవడంతో, చమురు సంస్థలు ప్రతి నెలా దాదాపు రూ. 30,000 కోట్ల నష్టాన్ని చవిచూస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం, చమురు సంస్థలు కలిసి లీటర్ పెట్రోల్‌పై దాదాపు రూ. 24 భారాన్ని భరిస్తూ వినియోగదారులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. అయితే, పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడి వల్ల ధరల సవరణ అనివార్యంగా కనిపిస్తోంది.ఒకవేళ ధరల పెంపునకు ఆమోదం లభిస్తే.. ఎంత పెరిగే అవకాశం ఉంది? పెట్రోల్, డీజిల్: లీటరుకు రూ. 4 నుండి రూ. 5 వరకు పెరగవచ్చు.

వంట గ్యాస్: సిలిండర్‌పై రూ. 40 నుండి రూ. 50 వరకు పెరిగే అవకాశం ఉంది. గత నాలుగు ఏళ్లుగా (2022 నుండి) ఇంధన ధరల్లో పెద్దగా మార్పులు లేవు, కాబట్టి ఇది వాహనదారులపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.మధ్య ప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు మరియు హార్ముజ్ జలసంధిలో సరఫరాకు అంతరాయం కలగడం వల్ల ప్రపంచవ్యాప్త చమురు సరఫరాలో 20 శాతం ప్రభావితమైంది. ఇది ముడిచమురు ధరలను ఆకాశానికి చేర్చింది. భారత్ ప్రస్తుతం రష్యా, అమెరికా, పశ్చిమ ఆఫ్రికా దేశాల నుండి దిగుమతులను పెంచడం, ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తోంది. అయితే, ద్రవ్యోల్బణం పెరగకుండా ఉండటానికి, చమురు సంస్థల ఆర్థిక స్థితిని కాపాడటానికి ప్రభుత్వం ఇప్పుడు సమతుల్య నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రితో పాటు జి ఆర్ కె

**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,మే 9;** ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయమునందు శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించినట్లు ఆలయ ట్రస్ట్ ప్రత్యేక ఆహ్వానితులు గడ్డ మణుగు రవికుమార్ జీలుగుమిల్లిలో ఒక ప్రకటనలో పేర్కొన్నారు .అని వేట్టి మండపం ఫీజు టు 12 కోట్లు, భక్తులు వేసి యుండు క్యూ కాంప్లెక్స్ 12 -50 కోట్లు, శివాలయం ఐదు అంతస్తుల రాజగోపురం 4:50 కోట్లు నూతనంగా ఆలయం నందు ప్రారంభించారు. స్వామివారి అంతరాలయంలో మంత్రికి ప్రత్యేక పూజలు నిర్వహించారు .అనంతరం వేద ఆశీర్వాసన మండపంలో వేద పండితులు మంత్రికి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని మంత్రికి అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం జె అభిషేక్ గౌడ్, వంశపారపర్యం ధర్మకర్త మండలి చైర్మన్ సుధాకర్ రావు, అనువంశిక ధర్మకర్త నీ వృత్తి రావు, ప్రధాన అర్చకులు



పిఆర్జే ఆచార్యులు, దేవాదాయ శాఖ సంయుక్త కమిషనర్ ఆలయ ఈవో త్రినాధరావు, మాజీ శాసనసభ్యులు ఘంటా మురళి, దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు, అధికారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఆర్టీసీ బస్సు బోల్తా పదిమంది కి గాయాలు




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ,మే 9:** భద్రాచలం నుండి కాకినాడ వెళుతున్న సూపర్ ఏపీఎస్ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు రంపచోడవరం సమీపంలోని చిన్న గెద్దాడ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. భద్రాచలం నుండి కాకినాడ డిపోకు చెందిన ఏపీఎస్ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు 40 మంది ప్రయాణికులతో కాకినాడ వస్తుండగా చిన్న గెద్దాడ వద్ద ఎదురుగా వస్తున్న ఆటో తప్పించబోయి బస్సు అదుపుతప్పి బోల్తా పడింది దీంతో బస్సులోని ప్రయాణికులు అందరూ గాయాల పాలయ్యారు. ప్రమాదం జరిగినట్లు సమాచారం అందడంతో రంపచోడవరం డిఎస్పి అష్రఫ్ అలీ సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 సహాయంతో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న అందరికీ గాయాలు కాగా పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి వీరిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. రంపచోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

# బస్సు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి





ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ మే 9:** బస్సు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి వైద్యాధికారులకు సూచించారు. భద్రాచలం నుండి కాకినాడ వెళ్తున్న బస్సు చిన్న గెద్దాడ వద్ద శనివారం ప్రమాదానికి గురైంది.సంఘటన వివరాలు తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించి క్షతగాత్రులను పరామర్శించారు. ప్రతి గాయపడిన వ్యక్తిని వ్యక్తిగతంగా కలసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల పురోగతిని సమీక్షించి, అవసరమైతే రాజమండ్రి, కాకినాడకు రిఫర్ చేయాలని సూచించారు. వైద్య సేవల్లో ఎలాంటి జాప్యం లేకుండా తక్షణ చికిత్స అందించాలని కోరారు.అలాగే తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో పోలీసులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఎస్టీ విభాగం అధ్యక్షుడు పండా చెల్లన్న దొర (బాబీ), అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అడబాల బాపిరాజు, టీడీపీ నేతలు ముప్పా శ్రీను, జి. నారాయణ, ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకులు బి. రాహుల్, రంపచోడవరం రెవెన్యూ ఇన్స్పెక్టర్ నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదులు, న్యాయాధికారులు మధ్యవర్తిత్వం ప్రోత్సహించాలి








- నగరంలో నూతన 10 కోర్టుల భవన సముదాయాన్ని ప్రారంభించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 9:** న్యాయవాదులు, న్యాయాధికారులు మధ్యవర్తిత్వం ప్రోత్సహించా లని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ అన్నారు. మధ్యవర్తిత్వం కుటుంబ వివాదాలు, మోటార్ ప్రమాద కేసులకు పరిమితం చేయరాదన్నారు. వివాదాలను పరస్పర అవగాహనతో పరిష్కరించడమే నిజమైన విజయమన్నారు. నగరం లో నూతన 10 కోర్టుల భవన సముదాయానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ శనివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా జస్టిస్ లిసా గిల్ మాట్లాడుతూ,న్యాయ మౌలిక వసతులు ప్రజల భావోద్వేగాలకు, న్యాయ వ్యవస్థ నిబద్ధతకు ప్రతీకలన్నారు. న్యాయ వ్యవస్థలో ప్రతి ఒక్కరూ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి నప్పుడే న్యాయం సమాజంలోని అన్ని వర్గాలకు చేరుతుందన్నారు.

గోదావరి ప్రాంతాల సాంస్కృతిక, సాహిత్య, న్యాయ వారసత్వాన్ని ప్రస్తావిస్తూ, ఈ నేల నుంచి ఎందరో మహానుభావులు వెలుగులోకి వచ్చారని కొనియాడారు.

న్యాయ వ్యవస్థలో సాంకేతిక ప్రాధాన్యం పెరుగుతోందని, డిజిటలైజేషన్ అనివార్య మైందన్నారు. కృత్రిమ మేధస్సు వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చాట్‌జీపీటీ వంటి సాంకేతికత మానవ స్వతంత్ర ఆలోచనకు ప్రత్యామ్నాయం కావని స్పష్టం చేశారు.కొత్త కోర్టు భవన సముదాయానికి నిరంతర నిర్వహణ, ఆధునీకరణ ఉండాలని, పరిపాలన దృష్టి సారించాలన్నారు. విచారణలు వేగంగా పూర్తయ్యేందుకు సాక్షుల హాజరు అంశాల్లో పోలీసు శాఖ పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ భవన నిర్మాణంలో పాల్గొన్న ఇంజినీర్లు, అధికారులు, కార్మికులనీ ఆమె అభినందించారు. ఈ నూతన కోర్టు భవనం సత్యం, న్యాయం, ధర్మానికి మార్గదర్శకంగా నిలిచి న్యాయ సేవలను బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**బార్ -- బెంచ్ సమన్వయంతోనే న్యాయ వ్యవస్థ బలోపేతం**

**- జస్టిస్ బట్టు దేవానంద్**

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ, న్యాయ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడం లో బార్ ,బెంచ్ ల మధ్య పరస్పర సహకారం, సమన్వయం అత్యంత అవసరమన్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు వేర్వేరు బాధ్యతలయిన సామాన్య ప్రజలకు న్యాయం అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి గంధం సునీత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.వి.ఎల్. ప్రసాద్, తదితరులను అభినందించారు. కోర్టు భవన నిర్మాణానికి 14 సంవత్సరాలు పట్టడం సరైనది కాదని కోర్టులకు అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది, సదుపాయాలు కల్పించడం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల బాధ్యతని స్పష్టం చేశారు.

**న్యాయ మౌలిక వసతులు న్యాయపాలన నిబద్ధత**

**ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి గంధం సునీత**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ, రాజమహేంద్రవరంలో ప్రారంభమైన నూతన 10 కోర్టుల భవన సముదాయం జిల్లా న్యాయ చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ ఆర్. రఘునందన్ రావు, జస్టిస్ బి.వి.ఎల్.ఎన్. చక్రవర్తి, జస్టిస్ సుమతి జగడం, జస్టిస్ న్యాపతి విజయ్ , జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్.వి. ప్రసాద్, పలువుర న్యాయ మూర్తులు, న్యాయ వాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, ఎస్పీ డి నరసింహ కిషోర్, మునిసిపల్ కమిషనర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.









# ఫైవ్ జి ఫోన్ లకే సిగ్నల్

- బిఎస్ఎన్ఎల్ సేవల్లో
- వింత నాటకం

**వై రామవరం, పెన్ పవర్, మే 9 :** మండలంలో బిఎస్ఎన్ఎల్ సేవలు వినియోగదారులకు వింత నాటకంగా ఫైవ్ జి ఫోన్ లకే సిగ్నల్స్ ఉంటున్నాయని ఆరోపిస్తున్నారు.

మండలంలో మారుమూల ప్రాంతాలలో కూడా బిఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేయడం జరిగిందని వినియోగదారులకు సేవలు అందించడంలో పూర్తిగా విఫలం అయిందని ఆరోపిస్తున్నారు . గతంలో 2జి, 3జి సేవలందించే బిఎస్ఎన్ఎల్ 4జి గా మార్పు చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం 5జి చేయడం తో మిగతా ఫోన్లు పనిచేయడం లేదని వినియోగదారులు అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బిఎస్ఎన్ఎల్ సేవలు వినియోగదారులకు అందరికీ అందించే విధంగా చర్యలు తీసుకోగలరని కోరుచున్నారు.



# చాంబర్ భవనంలో వర్తకులకు ఆదాయపు పన్నుల శాఖ అవగాహన







**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 9:** చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఆద్వర్యం లో శనివారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు ఛాంబర్ అధ్యక్షులు తవ్వా రాజా సభాధ్యక్షత వహించారు. కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ స్వాగత ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా సమావేశమునకు విచ్చేసిన ముఖ్య అతిధులు ఇన్ కమ్ టాక్స్ జాయింట్ కమిషనర్ ప్రతాప్ సింగ్ భూక్యా, ఉప్పులూరి మీనా, అసిస్టెంట్ కమిషనర్ ఎర్రంశెట్టి రమణి, విచ్చేచారు .ఇటీవల ఆదాయపు పన్నుల చట్టంలో ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానములను, మార్పులు, సులభతరంగా వర్తకులకు వివరించారు. వర్తకుల సందేహాలను నివృత్తి చేసారు. ఆదాయపు పన్నులకు సంబంధించి వర్తకులకు సందేహాలు వివృత్తి చేసుకో వాలన్నారు. ఈ సమావేశంలో చాంబర్ ఉపాధ్యక్షులు వంటెద్దు సూరిబాబు , ఇయ్యపు మురలీధర్ , ఎక్సఫిషియో ఉపాధ్యక్షులు కనకాల రాజా , సంయుక్త కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ , ట్రస్ట్ బోర్డ్ కార్యదర్శి పచ్చిగోళ్ళ సురేష్ కుమార్ , చాంబర్ మాజీ అధ్యక్షులు బూర్లగడ్డ వెంకట సుబ్బారాయుడు , మాజీ కార్యదర్శి ముద్దుల మురళీకృష్ణ గారు, మాజీ ఉపాధ్యక్షులు ఇన్నమూరి రాంబాబు , డైరెక్టర్ శ్రీమతి కొయ్యాన కుమారి , చాంబర్ కార్యవర్గ సభ్యులు ట్రస్ట్ బోర్డ్ సభ్యులు వివిధ వర్తక సంఘాల ప్రతినిధులు హాజరై యరు.

# ద్వారకాతిరుమల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి-మంత్రి రామ నారాయణరెడ్డి





**గోపాలపురం,పెన్ పవర్ మే 9** :నియోజకవర్గంలోని ద్వారకాతిరుమలలో కొలువైన కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు.శనివారం మాయమా స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు,జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజుతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఆలయ ప్రాంగణంలో సుమారు 12 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న అనివెట్టి మండపం ఫేస్ 2 పనులను మంత్రి ఎమ్మెల్యే తో కలిసి ప్రారంభించారు.భక్తుల సౌకర్యార్థం పన్నెండున్నర కోట్ల నిధులతో నిర్మించనున్న క్యూ కాంప్లెక్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.అలాగే ఆలయ పరిసరాలలో ఉన్న శివాలయం వద్ద నాలుగున్నర కోట్లతో నిర్మిస్తున్న 5 అంతస్తుల రాజగోపుర నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూతన క్యూ కాంప్లెక్,అనివేటి మండపం నిర్మాణాలు భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.రాజగోపురం ప్రారంభంతో ఆలయ మహిమ మరింత పెరుగుతుందన్నారు.కూటమి నాయకులు,గ్రామస్తులు,అధికారుల సహాయసహకారాలతో అభివృద్ధి పనులు ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు భవిష్యత్తులో ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ద్వారకాతిరుమల పేరు ప్రఖ్యాతలు మరింత పెరిగిందన్నారు.ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తూనే ఉంటానన్నారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా చూడవలసిన బాధ్యత అధికారులు,పాలకవర్గ సభ్యులదే అన్నారు.కార్యక్రమానికి ముందు ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి ఆనం,ఎమ్మెల్యే మద్దిపాటి,ఇంచార్జ్ సువర్ణ రాజు లను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించారు.ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో టిడిపి,జనసేన,బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి-ఎస్ఐ సుబ్రహ్మణ్యం



**గోపాలపురం,పెన్ పవర్ మే 9** :మండలంలోని కరిచర్లగూడెం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు.ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై వీ.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన కే.నాగేశ్వరరావు(40) శుక్రవారం రాత్రి రహదారిపై వెళ్తూ ఉండగా కొయ్యలగూడెం వైపు నుండి గోపాలపురం వైపుకు వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొందన్నారు.నాగేశ్వరరావు కు బలమైన దెబ్బలు తగలడంతో రహదారిపై పడిపోయి మృతి చెందారన్నారు.ఈ ప్రమాద సంఘటనకు సంబంధించి మృతిని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.శవాన్ని పోస్టుమార్టు నిర్వహించనున్నామన్నారు.

## వరదలను దృష్టిలో పెట్టుకొని ఎంపీటీసీ నిధులతో చేతి పంపు



**కూనవరం,పెన్ పవర్,మే9.** రాబోయే వరదలను దృష్టిలో పెట్టుకుని మండలంలోని జగ్గవరం గ్రామపంచాయతీ కోతులగుట్ట సచివాలయం నందు ఎంపీటీసీ నిధులతో చేతి బోరుకు వైస్ ఎంపీపీ బండారు సాంబశివరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలు వచ్చినప్పుడు కూనవరం, టేకులబోరు గ్రామ ప్రజలకు మంచినీటి సమస్య రాకూడదని సచివాలయం వద్ద చేతిపంపు వేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమానికి జగ్గవరం బూత్ ఇన్చార్జ్ బోడ వెంకటేశ్వర్లు,సొసైటీ డైరెక్టర్ నోముల సత్యనారాయణ, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షులు శేఖర్, గంపల కృపానందం,తుష్టిరాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## వైశ్య సేవా సదనంలో సుభద్ర నిలయానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శంకుస్థాపన



**రాజమహేంద్రవరం పెన్ పవర్, మే 9:** స్థానిక గోదావరి గట్టున ఉన్న వైశ్య సేవా సదనంలో సుభద్ర నిలయానికి శనివారం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) శంకుస్థాపన చేసారు . వందేళ్ల చరిత్ర కలిగిన సదనం మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకునేలా కమిటీ కృషిచేయాలని, సహాయ సహకారాలు అందచేస్తామన్నారు. సదనం, ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల సమస్యలను కరస్పాండెంట్, నిర్వాహకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు గాదె కిషోర్, సెక్రటరీకరస్పాండెంట్ కోట్ల కనకేశ్వరరావు మాట్లాడుతూ సదనం వందేళ్లు పూర్తి చేసుకుందని, సుభద్ర నిలయాన్ని నిర్మాణం చేస్తామన్నారు. విద్యార్థులకు ఉచితంగా వసతి, భోజన సదుపాయాల్ని కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో శెట్టి జగదీష్, పెంటపాటి సుభాష్, గమిని రంగయ్య, మాటూరి రంగారావు, పులవర్తి లక్ష్మణస్వామి, మాటూరి ఆదినారాయణ, నిమ్మలపూడి గోవింద్,, కమిటీ సభ్యులు కూర్మదాసు ప్రభాకర్, మన్యం ఫణికుమార్, నాళం వెంకటేశ్వరావు, ఊటుకూరి శకుంతల కుమారి, కొల్లేపల్లి రత్నావతి, ప్రిన్సిపాల్ ఎంవి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్ 1 గా తీర్చిదిద్దుతా-ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం, పెన్ పవర్ మే 9** :రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో నియోజకవర్గాన్ని నంబర్ 1 గా నిలపడానికి కృషి చేస్తానని స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు అన్నారు.నియోజకవర్గంలోని నాయకులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రే అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు.ద్వారకాతిరుమల స్వామి వారి దర్శనానికి కాలి నడకన వెళ్ళే భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో దూబచర్ల గ్రామం నుండి ద్వారకా తిరుమల వరకు రహదారికి ఇరువైపులా ఫుట్ పాత్ నిర్మించనున్నామన్నారు.భక్తులకు అసౌకర్యం కలుగకుండా విద్యుత్ సౌకర్యం వంటివి కల్పించనున్నామన్నారు.పార్టీ నాయకుల అభీష్టం మేరకు జూన్ 9 నుండి నాలుగు రోజులపాటు పాదయాత్ర చేపట్టనున్నామన్నారు.ఎన్నికల ముందు ఏ విధంగా అయితే దేవరపల్లి మండలం గౌరీపట్నంలో కొలువైవున్న నిర్మాలగిరి మాట పుణ్యక్షేత్రము నుండి ద్వారకాతిరుమల వరకు కొనసాగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొవాలని కోరారు.గ్రామ స్వరాజ్యంలో భాగంగా నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల్లో మమేకం అవ్వాలని సూచించారు.ఎవరైతే గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తారో వారి సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మెప్పించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.తొందర్లో యర్నగూడెం నుండి ర్యాజంపూడి వెళ్లే రహదారి నిర్మాణానికి భూమి పూజ చేయనున్నామన్నారు.అలాగే లక్ష్మీపురం,దొండపూడి రహదారి సైతం నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు.

## నరసాపురం గ్రామం చెత్తతో ఎక్కడికక్కడ నిండిపోయింది..






- **ఉదయాన్నే స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి తనిఖీ..**
- **రెండు రోజులు గడుస్తున్న పంచాయతీ సెక్రెటరీ పట్టించుకోలేదు..**

**కోరుకొండ, పెన్ పవర్, మే 9:** కోరుకొండ మండలం నరసాపురం గ్రామం గత నాలుగు నెలలుగా ఎక్కడ చెత్త అక్కడ ఉండిపోవడం డ్రైనేజీ వద్ద వేపుగా మొక్కలు పెరుగుపోవడం ఇంటి వద్ద చెత్త అక్కడ బస్తాలతో ఉండిపోయాయి. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు ఉదయాన్నే స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి ప్రతి ఇంటికి వెళ్లి తనిఖీ చేపట్టారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని అడిగి తెలుసుకున్నారు. గత నాలుగు నెలలుగా పంచాయతీ చెత్త తీసుకుని వెళ్లే సైకిల్ రిక్షా రాలేదని ప్రజలు సంధ్యారాణి కి వివరించారు. చెత్త పేరుకుపోవడంతో దోమలు, ఈగలు ప్రబలించి అంటువ్యాధులు వస్తాయని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీ సెక్రెటరీ కి చెప్పిన కనీసం పట్టించుకోవడం లేదు. స్పెషల్ ఆఫీసర్ ముందు ట్రాక్టర్ వస్తుంది అన్ని సక్రమంగా జరుగుతున్నాయని చెప్పుకుంటూ వస్తున్నారు. దగ్గరుండి పర్యవేక్షించిన ఆమె కొన్ని ఆసక్తికర ప్రదేశాలను చూసి ఆమె ఆశ్చర్యపోయారు. వెంటనే శానిటైజేషన్ చేపిస్తానని ప్రజలకు సంధ్య రాణి వివరించారు.

## తమిళనాడులో విజయ్‌ని ప్రమాణ స్వీకారం చేయనివ్వాలి

**కాంగ్రెస్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే డిమాండ్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 9:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాలరాస్తూ తమిళనాడులో గవర్నర్ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించిన టివికె పార్టీ అధినేత విజయ్‌ను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయకుండా అడ్డంకులు సృష్టించడంపై కాంగ్రెస్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వర రెడ్డి మండిపడ్డారు. గవర్నర్ స్పందించి ముఖ్యమంత్రిగా విజయ్‌తో ప్రమాణ స్వీకారం చేయించాలని డిమాండ్ చేసారు. స్థానిక రాజమహేంద్రి కళాశాలలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మెజార్టీ సీట్లు వచ్చిన విజయ్‌ను ప్రమాణ స్వీకారం చేయానివ్వకుండా గవర్నర్ ప్రధాని మోదీ, హోమ్ మంత్రి అమిత్ షా చేతిలో కీలుబొమ్మగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ లోక్ సభా పక్ష నేత రాహుల్ గాంధీ తమిళనాడులో ఆయనకు మద్ధతుగా నిలిచారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ వి ప్రసాదరావు మాట్లాడుతూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తోందని, న్యాయస్థా నాల్ని అడ్డుపెట్టుకుని సామాన్య ప్రజలను ఇబ్బంలకు గురిచేస్తు న్నారని ధ్వజమెత్తారు. రా జ్యాంగాన్ని పక్కన పెట్టి మతం, కులాన్ని ముందు పెట్టుకుని దేశాన్ని వందేళ్లు వెనక్కి వెళ్లేలా చేస్తున్నారని విమర్శించారు.

## శ్రీకృష్ణ మందిరం లో నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 9:**రాజమహేంద్రవరం రూరల్మండలం పిడింగొయ్యి పంచాయితీ కవలగొయ్యి లో శ్రీకృష్ణ మందిరం ఆలయాన్ని పునర్నిర్మాణం చేసి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా జరిగే గణపతి హోమం కార్యక్రమానికి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి హాజరయ్యారు. నూతన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా 25000/- వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఏ.ఎం.సి చైర్మన్ మార్ని వాసుదేవ్ 25000/- వేల రూపాయలు, గ్రామ పార్టీ అధ్యక్షులు మట్ట శ్రీను 10000/- వేల రూపాయలు విరాళాన్ని ఎమ్మెల్యే గోరంట్ల చేతుల మీదుగా కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, పత్తి మంగా, ముప్పిడి రాంబాబు, కసిరెడ్డి దుర్గాప్రసాద్, చిచ్చారి సుబ్బారావు, మార్ని దొరబ్బాయి, కాప శ్రీను, కందిరేళ్ళ సత్తిబాబు, మరుకుర్తి వెంకటేశ్వరరావు, అంకం అయ్యన్న, నక్క శ్రీను, గెద్దం ప్రభుదాస్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కర ఘాట్‌లను తనిఖీ చేసిన డీఎస్పీలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 9** :తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు రాబోయే గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఈస్ట్ జోన్ డీఎస్పీ బి. విద్య, సౌత్ జోన్ డీఎస్పీ ఏ.శివ ప్రియ సబ్‌డివిజన్ పరిధిలోని ఘాట్‌లను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఘాట్‌ల వద్ద భక్తుల రద్దీ నియంత్రణ, భద్రతా చర్యలు, ట్రాఫిక్ మళ్లింపు, అత్యవసర సేవల అంశాలను పరిశీలించారు.

పుష్కరాల సమయంలో వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులతో చర్చించారు. ఘాట్‌ల వద్ద తాత్కాలిక సదుపాయాలు, బ్యారికేడింగ్, కంట్రోల్ రూమ్‌లు, సీసీ కెమెరాల ఏర్పాటు, మహిళలు వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలపై కూడా సమీక్ష నిర్వహించారు.పుష్కరాల నిర్వహణను విజయవంతంగా చేపట్టేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధవలేశ్వరం ఇన్స్పెక్టర్ టి. గణేష్ ,మండపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. దొర రాజు స్టేషన్ ఎస్సైలు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన కళల పరిరక్షణకు ప్రభుత్వం కృషి-జగదీశ్వరి





**గోపాలపురం,పెన్ పవర్ మే 9** :రాష్ట్రంలోని మారుమూల గిరిజనుల సాంప్రదాయ కలల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని రాష్ట్ర క్రీడా సాధికారిక సంస్థ నిర్వాహకురాలు కొవ్వాసు జగదీశ్వరి అన్నారు.కలియుగ ప్రత్యక్ష దైవముగా పిలువబడే శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పుణ్యక్షేత్ర ఆవరణలో తాతయ్యగుంట శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతర జరుగనుంది.తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి కోరిక మేరకు పోలవరం,అరకు ప్రాంతం నుండి సాంప్రదాయ గిరిజన నృత్య కళాకారులను పంపించినట్లు జగదీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు.పోలవరం నుండి కొమ్ము కోయ నృత్య బృందాన్ని,అరకు ప్రాంతం నుండి దింసా నృత్య కళాకారులను పంపించడం జరిగిందన్నారు.అమ్మవారి జాతర సందర్భంగా వీరు సాంప్రదాయ నృత్యాలను ప్రదర్శిస్తున్నారని జగదీశ్వరి తెలిపారు.

# రాఘవపురం ఉపాధి హామీ శ్రామికులతో మమేకమైన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..





**కోరుకొండ, పెన్ పవర్, మే 9:**రాజానగరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శనివారం ఉదయం రాఘవపురం గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు నిర్వహిస్తున్న శ్రామికులను క్షేత్రస్థాయిలో కలిసి వారి యోగక్షేమాలను మరియు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి హామీ శ్రామికులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే వారికి అందుతున్న వేతనాలు,పని ప్రదేశంలో కల్పిస్తున్న కనీస సౌకర్యాల గురించి ఆరా తీశారు. శ్రామికులు తమ దృష్టికి తెచ్చిన పలు సమస్యలపై స్పందిస్తూ, ఉపాధి హామీ శ్రామికులకు పని వేళల్లో ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుమ్మంపాడు లో ఉచిత కంటి వైద్య శిబిరం





**అత్తిలి ,పెన్ పవర్, మే 9:**మండలంలోని గుమ్మంపాడు సచివాలయం ప్రాంగణంలో శనివారం అత్తిలి పీహెచ్సీ వైద్యాధికారి కే నాగరాజు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తణుకు శాసనసభ్యుడు అరిమిల్లి రాధాకృష్ణ అందత్వం నివారణ మన లక్ష్యం అనే ఆశయంతో చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరం కంటి వైద్య నిపుణులు సత్యనారాయణ కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 114 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అవసరమైన వారికి త్వరలో కళ్ళజోళ్ళు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే కంటి శుక్లాం ఆపరేషన్ అవసరమైన వారికి త్వరలో ఆపరేషన్ చేయించడం జరుగుతుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రరాజు, పండు, సుధాకర్, సుబ్బరాజు, విజయశ్రీ, రామారావు, సుబ్బారావు, హెచ్ వి అమ్మాజీ, ఎం.ఎల్.హెచ్.పి సుభద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రూరల్ మండలం లో కౌశలంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు

– డి డి వో కె రత్న కుమారి




**రాజమహేంద్రవరం పెన్ పవర్, మే 9:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "కౌశలం కార్యక్రమంలో భాగంగా, 18 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులకు కౌశలం సర్వే పూర్తి చేయాలని జిల్లా అభివృద్ధి అధికారి కె రత్న కుమారి తెలిపారు. అర్హత సాధించిన అభ్యర్థులకు స్వర్ణ గ్రామ, వార్డుల కౌశలం పరీక్షలు నిర్వహించామని కె రత్న కుమారి తెలిపారు. ఈ పరీక్షల్లో రెండు దశల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల కోసం శుక్రవారం రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రముఖ సంస్థ బజాజ్ పిన్ సర్వ్ ఆధ్వర్యంలో రెండు రోజుల్లో సుమారు 210 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించా మన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 554 మంది అభ్యర్థులు ఆసక్తి చూపగా, 210 మందికి ఇంటర్వ్యూలకు అవకాశం కల్పించమన్నారు. 167 మంది అభ్యర్థులు హాజరై ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో బజాజ్ ఫైనాన్స్ సర్వీస్ హెచ్ఆర్ ప్రతినిధులు, జిల్లా స్వర్ణ గ్రామ,వార్డు కో-ఆర్డినేటర్, అదనపు కో-ఆర్డినేటర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# కొండరెడ్ల పోరు బాట సభను జయప్రదం చేయండి





**వి.ఆర్.పురం పెన్.పవర్.మే.9:**ఆదివాసి కొండరెడ్ల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న "కొండరెడ్ల పోరు బాట" బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదివాసి కొండరెడ్ల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 10-05-2026న ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కోయిదా గ్రామంలో ఆదివాసి కొండరెడ్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నకొండరెడ్ల పోరు బాట బహిరంగ సభకు సంబంధించిన ప్రచార కార్యక్రమాన్ని శనివారం వి.ఆర్. పురం మండలంలోని పలు కొండరెడ్డి గ్రామాల్లో నిర్వహిం చారు. ఈ సందర్భంగా సంఘం పోలవరం జిల్లా నాయ కులు ముర్ల కనకారెడ్డి,మండల నాయకులు అందెల శ్రీరామ్మూర్తి రెడ్డి,మాట్లాడుతూ కొండరెడ్ల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించి,వారి సంక్షే మానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ముంపుకు గురైన ఆదివాసి గ్రామాల ప్రజలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భూమికు బదులుగా భూమి ఇవ్వకుండా, అర్హులైన నిర్వాసితులకు పూర్తి స్థాయి ఆర్.అండ్.ఆర్ ప్యాకేజీలు అందించడం లేదని,ఆరోపించారు. పోడు భూములకు నష్టపరిహారం ఇవ్వకపోవడం వల్ల ఆదివాసి కుటుంబాలు జీవ నాధా రాన్ని కోల్పోతున్నాయని పేర్కొన్నారు. ఆర్.అండ్.ఆర్ కాలనీల్లో మౌలిక వసతులు సరిగా లేకపోవడంతో పాటు, వ్యవసాయం కోసం ఇచ్చిన భూముల్లో జామాయిల్ మొక్కల మోడ్లు ఉండటంతో సాగు చేయడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొందని అన్నారు. దీనివల్ల అమా యక ఆదివాసి కొండరెడ్లు మానసికంగా తీవ్ర ఆందోళనకు గురవుతూ గందరగోళ పరిస్థితుల్లో జీవిస్తున్నారని ఆవే దన వ్యక్తం చేశారు. 2016-17 కట్ ఆఫ్ సంవత్సరాలతో సంబంధం లేకుండా,41:5 కాంటూర్ పరిధిలో ఉన్న18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరికీ ప్రత్యేక ఆర్.అండ్.ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మండలంలోని చొక్కనపల్లి, దారపల్లి,కొటారిగుమ్ము,జీడిగుప్ప తదితర కొండరెడ్డి గ్రామాల్లో పర్యటించి ప్రజలకు బహిరంగ సభ ప్రాముఖ్యత వివరించారు. పెద్ద ఎత్తున ప్రజలు సభకు తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు,ఆదివాసినాయకులు,సంఘం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మల్లికార్జున స్వామి ఆశీస్సులు ప్రజలందరూ పైన ఉండాలి.

**ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, మే 9:** శ్రీ భ్రమరాంబికా సమేత, శ్రీ మల్లికార్జున స్వామి ఆశీస్సులు ప్రజలందరి పైనా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబికా సమేత శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీ గోపాలకృష్ణ ఆలయం నూతన ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముద్రగడ గిరిబాబు పాల్గొన్నారు.

ఆలయానికి చేరుకున్న ముద్రగడ గిరిబాబుకు ఆలయ అర్చకులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భగవంతుని ఆశీస్సులు అందరిపైనా ఉండాలని కోరారు. ప్రతిపాడు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని



ఆయన ఆకాంక్షించారు.?ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కత్తిపూడిలో ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ విగ్రహా ప్రతిష్ట





**-మహా యజ్ఞంలో పాల్గొన్న భక్తులకు ధన్యవాదాలు తెలిపిన వెన్నా శివ.**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్,, మే 9**:కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో శ్రీ గోపాలకృష్ణ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ సభ్యులు వెన్నా ఈశ్వరుడు (శివ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవాలు అత్యంత సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ప్రత్యేక హోమాలు,యాగాలు,వేద పండితుల మంత్రోచ్ఛారణల కన్నుల పండుగ నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి వేలాదిగా భక్తులు పాల్గొని అన్నప్రసాదాములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు,జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్,మాజీ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్,జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యులు పర్వత సురేష్, నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు,భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,శివభక్తులు తదితరులు పాల్గొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే భక్తులకు,ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ద్రాక్షారామ దేవస్థానంలో వివాహ మండపాల రేట్లు పెంపు.. భక్తుల్లో ఆందోళన

**రామచంద్రపురం , పెన్ పవర్,మే9:**ద్రాక్షారామం భీమేశ్వర స్వామి దేవస్థానంలో వివాహాలు నిర్వహించేందుకు మండపాల రేట్లు అధికంగా వసూలు చేస్తున్నారంటూ భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానం గజిట్ ప్రకారం సాధారణ మండపం రూ.6000, పూసల మండపం రూ.9000, ప్లాస్టిక్ పూల మండపం రూ.12000గా నిర్ణయించినప్పటికీ, పాటదారులు వీటికి మించి డబ్బులు వసూలు చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. దీంతో దేవస్థానంలో వివాహాలు నిర్వహించాలనుకునే కుటుంబాలు ఆర్థిక భారం ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులు వెంటనే స్పందించి, అధిక వసూళ్లపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. అలాగే ఇకపై మండపాల కాంట్రాక్టులు ఇవ్వకుండా, భక్తులు తమకు నచ్చిన వ్యక్తులతో బయట నుండి మండపాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# కోలంకలో జాతీయ క్షయ నిర్మూలన హెల్త్ క్యాంప్ కార్యక్రమం

**కాజులూరు, పెన్ పవర్,మే 9:** కాజులూరు మండలం కోలంక గ్రామంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొండా వెంకన్న, కోలంక సొసైటీ అధ్యక్షుడు బొండా వెంకట నరసింహ నాయుడు పాల్గొన్నారు. ఈ హెల్త్ క్యాంప్లో కోలంక గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎన్.ఎం శిరీష, ఎం.ఎల్.హెచ్.పి విజయశ్రీ, ఆశా వర్కర్లు వీరవేణి, నాగలక్ష్మి, విజయలక్ష్మి, కూటమి నాయకులు మేడిశెట్టి శంకర కృష్ణ, దూడల రామగంగారావు తదితరులు పాల్గొన్నారు.



# కైలాసగిరిలో భారీ త్రిశూలం ఆవిష్కరణ

## విశాఖను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం ఎం.పీ భరత్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 09 :**విశాఖపట్నంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిలో నిర్మించిన 65 అడుగుల భారీ త్రి శూలాన్ని శనివారం ఘనంగా ఆవిష్కరించా రు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారా యణ, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండ పల్లి శ్రీని వాస్‌తో కలిసి విశాఖపట్నం పార్లమెంట్ సభ్యు లు మతుకుమిల్లి భరత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.పీ. భరత్ మాట్లాడుతూ, కైలాసగిరిలో ఇప్పటికే శివపా ర్వతుల విగ్రహాలు ఉండటంతో ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆధ్యాత్మిక గుర్తింపు ఉందన్నారు. ఇప్పు డు భారీ త్రిశూలం, ఢమరుకం ఏర్పాటు చేయ డంతో కైలాసగిరి మరింత ఆకర్షణీయంగా మా రిందని తెలిపారు.సుమారు రూ.6 కోట్ల వ్యయం తో నిర్మించిన ఈ త్రిశూలం ప్రత్యేక సాంకేతిక ప్రమాణాలతో రూపొందించబడిందన్నారు. కైలా సగిరి ప్రాంతంలో అధిక గాలివేగాలను దృష్టిలో ఉంచుకుని, గంటకు 250 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినా తట్టుకునేలా నిర్మాణం చేపట్టి నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు పనులు పూర్తి కావడానికి సుమారు ఎనిమిది నెలల సమయం పట్టిందన్నారు.పర్యాటకుల కోసం త్రిశూలం పరి సర ప్రాంతాన్ని ప్రత్యేక పాత్‌వే జోన్‌గా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అక్కడి నుంచి విశాఖ నగర అందాలను వీక్షించే అవకాశం కల్పించడం తో సందర్శకులకు మరింత ఆహ్లాదకర అనుభూ తి లభిస్తుందన్నారు.గత కొద్ది నెలలుగా విశాఖ లో పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందు తోందని, దేశ విదేశాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారని ఎంపీ పేర్కొన్నా రు. కైలాసగిరిని గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాల, కైలాసగిరి, కంబాలకొండ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాలను అనుసంధానిస్తూ ప్రపంచ స్థాయి టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపా రు. విశాఖకు వచ్చే పర్యాటకులు నాలుగు నుంచి ఐదు రోజుల పాటు నగరంలో గడిపేలా పర్యాటకం, ఆధ్యాత్మికత, ప్రకృతి అందాలను సమన్వయం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ తేజ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# వాల్తేరు డివిజన్ విభజనపై ఆగ్రహం



కేకే లైన్‌ను కాపాడాలని బొలిశెట్టి సత్యనారాయణ డిమాండ్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 09:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వరుసగా జరుగుతున్న అన్యాయాలపై గళం ఎత్తాల్సిన సమయం వ చ్చిందని సామాజిక కార్యకర్త బొలిశెట్టి సత్య నారాయణ పేర్కొన్నారు. వాల్తేరు డివిజన్ విభ జన పేరుతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక ప్రయో జనాలకు తీవ్ర నష్టం కలిగిస్తోందని ఆయన ఆం దోళన వ్యక్తం చేశారు.శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ 2014 లో రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్ ను తెలంగాణకు కేటాయించడం ద్వారా ఆంధ్ర ప్రదేశ్ తీవ్ర నష్టాన్ని చవిచూసిందని గుర్తు చేశా రు. అదే తరహాలో ఇప్పుడు వాల్తేరు డివిజన్ వి భజన ద్వారా మరోసారి రాష్ట్రానికిఅన్యాయం జరుగుతోందన్నారు.అత్యధిక ఆదాయం తెచ్చి పెట్టే కొత్తవలస--కిరండూల్ కేకే రైల్వే లైన్‌ను రాయగడ డివిజన్ పరిధిలోకి మార్చే ప్రయత్నం జరుగుతోందని, ఇది విశాఖపట్నం డివిజన్ ఆర్థి క స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపా రు. గత ఆరు దశాబ్దాలుగా కేకే లైన్ ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలిచిందని పేర్కొన్నారు.విశాఖ రైల్వే డివిజన్ ఆదాయంలో ప్రధాన భాగం కేకే లైన్ నుంచే వస్తోందని, అలాం టి కీలకమైన ఆదాయ వనరును ఇతర రాష్ట్ర పరిధిలోకి తరలించడం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీయడమేనని విమర్శించారు.రాష్ట్ర ప్ర యోజనాలు దెబ్బతింటున్నా రాజకీయ నాయ కులు మౌనంగా ఉండటం బాధాకరమ న్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు కలిసి ఉద్యమించాలని పిలుపుని చ్చారు. నాయకులు స్పందించకపోతే ప్రజలే ఆత్మగౌరవం కోసం రోడ్డెక్కే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆయన పలు డిమాండ్లు చేశారు. వాల్తేరు డివిజన్‌ను యథా తథంగా కొనసాగించాలని, కేకే లైన్ ద్వారా వచ్చే పూర్తి ఆదాయాన్ని విశాఖపట్నం రైల్వే జోన్‌కే కేటాయించాలని, రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధ మైన నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## భూ ఆక్రమణదారుల నుండి స్టీల్ ప్లాన్ ప్రభుత్వ భూములు సంరక్షణ

**గాజువాక పెన్ పవర్,మే09:**పారిశ్రామిక ప్రాంతం గాజువాక నియోజకవర్గం, పెదగంట్యాడ 75వ వార్డు, శ్రీ పెంటమాంబ ఆలయం ఎదురుగా ఉన్న సుమారు 10 కోట్ల విలువచేసి 2 ఎకరాల జీవీఎంసి పర్యవేక్షణలో ఉన్న, స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ భూమిని, ఎమ్మెల్యేపల్లా చొరవతో కబ్జాదారుల నుంచి కాపాడడం సంతృప్తినిచ్చిందని మొల్లి పెంటిరాజు డైరెక్టర్ – ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ ,విశాఖ జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి వ్యాఖ్యానించారు.

గాజువాక నియోజవర్గం పర్యటనలో భాగంగా జివియంసి పరిధి 75వ వార్డ్, పెదగంట్యాడ, శ్రీ పెంటమాంబ ఆలయం ఎదురుగా, నీలపూ వీధి ప్రాంతం సర్వే నెంబర్లు 81,109 లో ఉన్న సుమారు 2 ఎకరాల జివియంసి పర్యవేక్షణలో ఉన్న స్టీల్ ప్లాంట్ భూమిని, ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించిన విషయమై నేను 2 నెలల క్రితం జిల్లా కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్ అభిసక్తి కిషోర్, విద్యాదరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావుకి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు..

ఈ భూమి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం గజం రూ. 13,000 చొప్పున దాదాపుగా రూ. 10 కోట్ల విలువ కలిగిన అత్యంత విలువైన ప్రభుత్వ భూమి ఉంది. ఇంత విలువైన భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు దర్జాగా ఆక్రమించుకొని ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం స్థానిక ప్రజలలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది అని,

గత ఏడాది జీవీఎంసీఆర్థిక సహాయంతో సుమారు రూ. 55 లక్షల వరకు నిధులు మంజూరు చేసి ఈ స్థలంలో కాంపౌండ్ వాల్, ఎస్డబ్ల్యు డ్రైన్లు నిర్మాణం చేపట్టడం జరిగింది. ఇది పూర్తిగా జీవీఎంసి నిర్వహణలో ప్రజా అవసరాల కోసం ఉన్న స్థలమని స్పష్టంగా తెలుస్తోంది. ఈ స్థలాన్ని స్థానిక ప్రజల అవసరాల కోసం నిర్మాణాలు చేపట్టి, చెట్లు నాటి హరితాభివృద్ధి చేయాలని, పెంటమాంబ అమ్మవారి ఆలయ సముదాయానికి ప్రహరీ గోడ నిర్మించి, స్థానిక గ్రామాల ఆలయాల నిర్మాణ అవసరాలకు మాత్రమే ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని స్థానిక గ్రామస్తులు, యువకులు కోరుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించిన పెదగంట్యాడ మండల తహసిల్దార్ అమల, స్టీల్ ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సంబంధిత అధికారులు, ఈ స్థలం స్టీల్ ప్లాంట్ భూముల సర్వే నెంబర్లు 81,109లో నెల్లిముకు గ్రామపంచాయతీ గ్రామాలైన నీలాపు వీధి , మొల్లివానిపాలెం , పాత అయ్యన్నపాలెం, అయ్యన్నపాలెం , నెలిముక్కు గ్రామాల ఆలయాల అభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలని, జీవీఎంసీ




సంరక్షణలో ఉన్న స్థలం అని తేల్చారు. అయితే ప్రస్తుతం ఈ స్థలంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు తమ వ్యాపార కార్యకలాపాల కోసం వరుసగా అక్రమ ఆక్రమణలు చేస్తున్నారని జిల్లా కలెక్టర్ వారికి నివేదిక సమర్పించడం జరిగినది.

జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి జివిఎంసి కమిషనర్ కి ఆ నిర్మాణాలను వెంటనే కూల్చివేసి ఆ స్థలాన్ని జీవీఎంసీ పర్యవేక్షణలోకి తీసుకోవాలని, సిటీ టౌన్ ప్లానర్, డిసిపి, ఏసిపి పట్టణ ప్రణాళిక విభాగ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆ స్థలంలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూలగొట్టి ఆ ప్రాంతానికి తాళాలు వేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేసి వెంటనే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

ఇంత విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల నుంచి కాపాడి ప్రజలకు అవసరమయ్యేలా తయారు చేయడానికి అవకాశం లభించిందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గా ఆనందంగా ఉందని, ఇది స్థానిక ప్రజల విజయమని మొల్లి పెంటిరాజు మీడియా సమావేశంలో తెలిపారు. ఇక పై మరలా ఈ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే వారిపై తప్పకుండా క్రిమినల్ కేసులు పెడతామని అధికారులు హెచ్చరించారని తెలిపారు.

## ప్రతిభావంతులు భావితరాలకు స్ఫూర్తిదాతలు:ఎమ్మెల్యే పల్లా



**గాజువాక: పెన్ పవర్,మే09:**పదో తరగతి పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన గాజువాక నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాత గాజువాక టిడిపి కార్యాలయం వద్ద అభినందన సత్కార సభ నిర్వహించారు.ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని ఉత్తమ విద్యార్థులను సత్కరించారు.నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్నిప్రకటించారు.ఫస్ట్ క్లాస్ విద్యార్థులకు 6 వేలు,సెకండ్ క్లాస్ విద్యార్థులకు 4 వేల రూపాయలు ఇస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకప్పటితో పోల్చితే నేడు ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది అన్నారు. ఇందుకు కర్త,కర్మ,క్రియ అన్నీ మంత్రి నారా లోకేష్ అని కొనియాడారు.ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే కాకుండా 10, ఇంటర్ ఫలితాల్లో అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా ఆయన చేపడుతున్న ప్రణాళికలు మంచి ఫలితాన్నిచ్చాయని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని పాఠశాలలన్నింటిని ఒక క్రమ పద్ధతిలో అభివృద్ధి చేసే దిశగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ బడుల్లో చదువుకుంటే కలిగే ప్రయోజనాన్ని తెలియజేసేలా ఇటీవల ఫలితాల్లో విద్యార్థుల కృషిని గుర్తిస్తూ ప్రభుత్వం పత్రికలు,టీవీల్లోనూ ఇచ్చిన ప్రకటనలు దేశవ్యాప్తంగా చరిత్ర సృష్టించాయని తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలోగాజువాక,నడుపూరు,కణితి, గంగవరం,అక్కిరెడ్డిపాలెం,మిందీ, ఇస్లాంపేట,అగనంపూడి ఉన్నత పాఠశాలలప్రధానోపాధ్యాయులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ కొర్ర భీమారావుకు ఘన నివాళి అర్పించిన జనసేన నేతలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 9:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీ ఎంపీటీసీ కొర్ర భీమారావు అంత్యక్రియలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొని ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. జనసేన పార్టీ నాయకులు గొర్లె వీర వెంకట్, వంతల సుబ్బారావు,గెమ్మెల సుబ్బారావు తదితరులు పాల్గొని భీమారావు ప్రజాసేవలో చేసిన కృషిని స్మరించుకున్నారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన సేవాభావం ఆదర్శనీయమని కొనియాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## హుకుంపేట మండల కేంద్రంలో ముంచేత్తిన వాన..!



**హుకుంపేట పెన్ పవర్ మే 9 :** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో శనివారం గాలివాన బీభత్సాన్ని సృష్టించింది. తీవ్రమైన గాలి వలన చెట్లు కొమ్ములు విరిగి పడ్డాయి దీంతో రోడ్డు మీద ప్రయాణించే ప్రయాణికులు భయంతో పక్కనే ఉన్న ఇళ్లల్లోకి షాపుల్లోకి పరుగులు తీశారు బీభత్సమైన వాన కురవడంతో ఆకాశం ముక్క విరిగిపడిందా అంటూ ప్రజలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు అంతా దాదాపు తక్కువ టైంలోనే ఎక్కువ వర్షం పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది గురై ఎక్కడ వాహనాలు అక్కడే ఆపేసుకున్నారు శనివారం హుకుంపేట మండల కేంద్రంలో సంత కావడంతో దుకాణదారుల దుకాణాలన్నీ తడిచి ముద్దయ్యాయి ఏదేమైనా శనివారం నాడు గాలి వర్షం ప్రజలను భయం చేసిందని చెప్పుకోవాలి.

## ఎంపీటీసీ భీమరాజు పార్థివ దేహానికి ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు నివాళి



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 9:**జి.కె.వీధి మండలం దామనపల్లి పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు కొర్ర భీమరాజు పార్థివ దేహానికి పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు శ్రద్ధాంజలి ఘటించారు. అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ భీమరాజు శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం భీమవరం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియలకు ఎమ్మెల్యే హాజరై పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా భీమరాజు కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీకి ఆయన చేసిన సేవలు మరువలేమన్నారు. పార్టీ తరపున కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దాన సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్,చింతపల్లి జడ్పీటీసీ పోతురాజు బాలయ్య, జిల్లా అధికార ప్రతినిధి కూడా సురేష్ కుమార్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి బుసారి కృష్ణారావు, జిల్లా కోశాధికారి కుందేరి రామకృష్ణ, చింతపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పాంగి గణబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రావణా నక్షత్రం సందర్భంగా వెంకన్న బాబు కి మహాభిషేకం



**గాజువాక: పెన్ పవర్,మే09:**జీవీఎంసీ 65వ వార్డు బానోజీ తోట వంబే కాలనీ గరుడాద్రి కొండపై వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణా నక్షత్రం స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా స్వామివారికి మహాభిషేకం ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ చైర్మన్ నేతృత్వంలో వైభవముగా వేద పండితులు ఆలయ ప్రధాన అర్చకులు ఉష శ్రీనివాసచార్యులు, విజయ నాయక్ చే ప్రత్యేక కలంకరణ చేసి మహా అభిషేకం నిర్వహించారు. దేవి శ్రీదేవి ఎంటర్ప్రైజెస్ అధినేత దేవత హేమ సుధాకర్ ఆర్థిక సహాయం అందించారు. సాయంత్రం ఏడున్నర గంటలకు శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి కళ్యాణం పి. ముత్యాల నాయుడు, సాయి దివ్య దంపతులు వారి ఆర్థిక సాయంతో కళ్యాణం జరుగుతుంది. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉత్తర ద్వారంలో ఉత్తరాంధ్రలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయం రెండవది. స్వామివారిని ఏడు వారాలు ముడుపులు కట్టి పూజలు చేసినవారికి స్వామివారి కృపా కటాక్షాలు ఉంటాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ జరిగినది.వీక్షించిన భక్తులకు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని కోరుతున్నామని నిర్వాహకులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాజు, జీవన్ జ్యోతి అప్పారావు దంపతులు, మీత్తని లక్ష్మి,బి.వెంకటేష్, ఓమి ఈశ్వరి, గొరుసు రామలక్ష్మి,పి. ఆదిలక్ష్మి,మరియు ఆలయ సేవకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# రూ.2,200 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మెగా ప్లాంట్!

**విజయవాడ, మే 9, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. ఐకానిక్ మోటార్‌సైకిల్ బ్రాండ్ రాయల్ ఎన్‌ఫీల్డ్, తన భారీ మెగా ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. సుమారు రూ. 2,200 కోట్ల పెట్టుబడితో తిరుపతి జిల్లా సత్యవేడులో ఈ తయారీ కేంద్రాన్ని నెలకొల్పుతున్నారు. 1901లో సంస్థ ప్రారంభమైన తర్వాత, తమిళనాడు వెలుపల ఇంతటి భారీ స్థాయిలో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి కావడం విశేషం.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్లాంట్ ద్వారా కేవలం మోటార్‌సైకిళ్ల తయారీ మాత్రమే కాకుండా, ఒక భారీ వెండర్ పార్క్ కూడా అభివృద్ధి చెందనుంది. దీనివల్ల రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు విడిభాగాలు సరఫరా చేసే అనుబంధ సంస్థలు కూడా ఆంధ్రప్రదేశ్‌కు తరలి రానున్నాయి. ఇది సత్యవేడును ప్రపంచ స్థాయి ఆటోమొబైల్ క్లస్టర్‌గా మార్చనుందిఈ ప్లాంట్ ప్రారంభం కావడంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం దాదాపు 9 లక్షల యూనిట్లు పెరగనుంది. దీంతో దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ ఎగుమతులలో కూడా సంస్థ మరింత దూసుకెళ్లే అవకాశం కనిపిస్తోంది. ప్రాజెక్టు కోసం సత్యవేడు మండలంలోని వన్నెలూరు గ్రామంలో 233.76 ఎకరాలు, రాళ్ళకుప్పం గ్రామంలో 42.38 ఎకరాలు కలిపి మొత్తం 267 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.మొదటి దశలో ప్రధాన తయారీ యూనిట్‌తో పాటు ప్రత్యేక వెండర్ పార్క్‌ను కూడా అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు. దీనివల్ల రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు అనుబంధంగా ఉన్న సరఫరాదారులు, భాగాల తయారీ సంస్థలు కూడా ఏపీకి తరలివచ్చే అవకాశముంది. దీని ఫలితంగా సత్యవేడు ప్రాంతం భవిష్యత్తులో ప్రపంచ స్థాయి ఆటోమొబైల్ తయారీ క్లస్టర్‌గా రూపుదిద్దుకునే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ప్రాజెక్టు తొలి దశను 2029 నాటికి, రెండో దశను 2032 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీర్ఘకాలిక పారిశ్రామిక వ్యూహంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది కీలక ఫలితంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ విస్తరణతో రాయల్ ఎన్‌ఫీల్డ్ తన దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ ఎగుమతులను కూడా గణనీయంగా పెంచుకోనుంది."రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి గ్లోబల్ బ్రాండ్ ఏపీని ఎంచుకోవడం రాష్ట్ర వ్యాపార అనుకూల వాతావరణానికి నిదర్శనం. ఇది రాష్ట్రాన్ని అడ్వాన్స్‌డ్ మానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతుంది" అని ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.దక్షిణ ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా మరో మెట్టు ఎక్కించే ఈ ప్రాజెక్టు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలవనుంది. కియా మోటార్స్ తర్వాత ఆటోమొబైల్ రంగంలో ఏపీ సాధించిన మరో అతిపెద్ద విజయం ఇది. సత్యవేడు కేంద్రంగా రాయల్ ఎన్‌ఫీల్డ్ చేసే ప్రయాణం ఏపీ పారిశ్రామిక భవిష్యత్తును సరికొత్త శిఖరాలకు చేరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## 483 ఫేక్ న్యూస్ కేసుల్లో ఏపీ టాప్

**విజయవాడ, మే 9, పెన్ పవర్:** 2024 సంవత్సరంలో దేశవ్యాప్తంగా మొత్తం 483 ఫేక్ న్యూస్ కేసులు నమోదవగా.. అందులో 203 కేసులు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే నమోదయ్యాయి. దీంతో ఫేక్ న్యూస్ కేసుల్లో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. తెలంగాణలో 139 కేసులు నమోదయ్యాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు కలిపి దేశవ్యాప్తంగా నమోదైన ఫేక్ న్యూస్ కేసుల్లో దాదాపు 70 శాతం వాటాను కలిగి ఉండటం గమనార్హం. సోషల్ మీడియాలో రాజకీయ అంశాలపైనే కాకుండా మతపరమైన అంశాలు, సామాజిక వివాదాలు, సాధారణ ఘటనలపైనా తప్పుడు ప్రచారాలు భారీగా పెరిగినట్లు నివేదికలో వెల్లడైంది. ఫేక్ పోస్టులు, మోర్ఫింగ్ వీడియోలు, తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో గందరగోళం సృష్టించే ఘటనలు అధికమయ్యాయని నేషనల్ క్రైం బ్యేరో రికార్డ్స్ పేర్కొంది.ఇక సైబర్ నేరాల విషయంలోనూ ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. 2024లో రాష్ట్రంలో మొత్తం 2,528 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే సైబర్ నేరాలు 8 శాతం పెరిగినట్లు నివేదిక తెలిపింది. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ యాప్స్, సోషల్ మీడియా బ్లాక్‌మెయిలింగ్, డిజిటల్ ఫ్రాడ్స్ పెరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం నేరాల పరంగా కూడా ఏపీలో పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు చీజ=దీ గణాంకాలు చెబుతున్నాయి. 2024లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,16,076 కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా హింసాత్మక నేరాలు భారీగా పెరిగినట్లు నివేదికలో వెల్లడైంది.మహిళలపై నేరాల విషయంలో కూడా ఆంధ్రప్రదేశ్ టాప్ రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించే నేరాల్లో రాష్ట్రంలో 2,965 కేసులు నమోదయ్యాయి. మహిళల వేధింపుల కేసుల్లో దేశంలో మూడో స్థానంలో ఏపీ నిలవడం ఆందోళన కలిగిస్తోంది.మానవ అక్రమ రవాణా కేసుల్లోనూ ఆంధ్రప్రదేశ్ దేశంలో మూడో స్థానంలో నిలిచినట్లు చీజ=దీ పేర్కొంది. మరోవైపు 2024లో రాష్ట్రంలో మొత్తం 898 హత్య కేసులు నమోదయ్యాయి. అంటే సగటున రోజుకు రెండు నుంచి మూడు హత్యలు జరుగుతున్నట్లు చీజ=దీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.రోడ్డు ప్రమాదాల విషయంలో కూడా ఏపీ దేశంలో 9వ స్థానంలో నిలిచింది. పెరుగుతున్న ప్రమాదాలు, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు ప్రధాన కారణాలుగా అధికారులు భావిస్తున్నారు. చీజ=దీ నివేదికతో రాష్ట్రంలో సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు, హింసాత్మక ఘటనలపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. ఎన్నికల సమయంలో ఫేక్ ప్రచారాలను అరికట్టేందుకు కఠిన చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## కుంకీ ఏనుగులకు ఆధార్‌లా ఓ గుర్తింపు కార్డు

**తిరుపతి, మే 9, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం గతేడాది కర్ణాటక నుంచి కుంకీ ఏనుగుల్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ ఏనుగులు ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని పలమనేరు కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చువరీలో ఉన్నాయి. అయితే ఈ ఏనుగులకు రెండు రోజుల క్రితం డీఎన్ఏ టెస్టులు నిర్వహించారు. బ్లడ్ శాంపిల్స్ సేకరించి డెహ్రాడూన్ పంపారు. ఆ టెస్ట్ రిజల్ట్స్ వచ్చిన తర్వాత ఏనుగులకు ఆధార్ కార్డులా ఓ గుర్తింపు కార్డును తగిలించనున్నారుసాధారణంగా మనుషులకు ఆధార్ కార్డులు ఉంటాయి.. ఎక్కడైనా ఏనుగులకు ఆధార్ కార్డులు ఉండటం చూశారా. ఏపీలో మాత్రం ఏనుగులకు ఆధార్ కార్డులు రాబోతున్నాయి.. అది కూడా ఆరు గజరాజులకు మాత్రమే. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్ని గమనించి అటవీశాఖ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. చిత్తూరు జిల్లాలోని పలమనేరు కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చువరీలో కుంకీ ఏనుగులు ఉన్నాయి.. వీటికి అధికారులు డీఎన్ఏ పరీక్షలు చేయించారు. ఈ ఏనుగుల నుంచి రెండు రోజుల క్రితం రక్త నమూనాలను సేకరించి డెహ్రాడూన్ వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్‌కు పంపారు.ఏనుగుల సంరక్షణ, పరిరక్షణ, శాస్త్రీయ అధ్యయనాల నిమిత్తం అధికారులు ఈ డీఎన్ఏ పరీక్షలు చేయించి ఆధార్ కార్డులా ఉండేట్టు ఓ గుర్తింపు కార్డును ఏనుగుకు తగిలించనున్నారు. డెహ్రాడూన్ వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ నుంచి టెస్టుల ఫలితాలు రాగానే ఆ వివరాలతో ఏనుగుకు ఒక గుర్తింపు కార్డును జారీ చేస్తారు. ఈ కుంకీ ఏనుగులకు ఇది ఆధార్ కార్డులా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఈ వివరాలతో రాబోయే రోజుల్లో ఏనుగులకు జన్యుపరమైన సమస్యలకు వైద్యంతో పాటు వాటి ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు అంటున్నారు. భవిష్యత్తు అవసరాలని గమనించి గజరాజులకు సంబంధించిన సమగ్ర వివరాల కోసం డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చిత్తూరు జిల్లా అటవీశాఖ అధికారులు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి అక్కడి నుంచి కుంకీ ఏనుగుల్ని రప్పించిన విషయం తెలిసిందే. అభిమన్యు, కృష్ణ, దేవ, జయంత్, రంజన్, వినయ్ అనే ఆరు కుంకీ గజరాజుల్ని తీసుకొచ్చి చిత్తూరు జిల్లా పలమనేరు క్యాంపులో ఉంచారు. ఈ కుంకీ ఏనుగుల దర్వారా అడవిలోని ఏనుగులు గ్రామాల మీదకు రాకుండా మళ్లించడానికి శిక్షణ ఇచ్చారు. రెండుసార్లు ఏనుగులు గ్రామాల మీదకు రాకుండా అటవీ ప్రాంతంవైపు మళ్లించే ప్రక్రియను విజయవంతం చేశారు. కర్ణాటక నుంచి ఏపీకి కుంకీ ఏనుగుల్ని తీసుకురావడానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అక్కడి ప్రభుత్వ పెద్దలతో చర్చించారు. గతేడాది కుంకీ ఏనుగుల్ని కర్ణాటక నుంచి ఏపీకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

## కూటమి గూటికి వైసీపీ ఎమ్మెల్యేలు

**విజయవాడ, మే 9, పెన్ పవర్:** ప్రస్తుతం కూటమిలో ఎమ్మెల్యేలుగా ఉన్న వారిలో కొంత మంది వైసీపీకి టచ్ లో ఉన్నారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇటీవల వైసిపి నాయకులు సైతం అవును... కొందరు టచ్ లో ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. దీంతో ఇది వాస్తవమేనా.. అసలు ఆ పరిస్థితి ఎందుకు వస్తుంది.. అనేది రాజకీయంగా ఆసక్తిగా మారింది. నిజానికి ఇలాంటి పరిస్థితి ఉంటుందని ఎవరూ ఊహించరు. కానీ రాష్ట్రంలో కొంతమంది ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో అలాంటి వారిని వైసిపి నాయకులు తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు అయితే చేస్తున్నారు..కానీ ఎవరూ ఈ విషయంలో బయటపడటం లేదు. వచ్చే ఎన్నికల నాటికి కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచేలా వైసిపి చేస్తున్న ప్రయత్నాల నేపథ్యంలోనే ఇప్పుడు కొంత మంది ఎమ్మెల్యేలు తమ వైపు ఉన్నారని చెబుతుండడం ఆసక్తిగా మారింది. అయితే, ఇప్పటికిప్పుడు దీనివల్ల ఇటు కూటమికి వచ్చిన నష్టం కానీ అటు వైసిపికి వచ్చిన లాభంగానీ ఏమీ కనిపించడం లేదు. ఇది కేవలం ప్రచారం మాత్రమే. ఇది ఒక రకంగా ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న పరోక్ష వ్యతిరేక ప్రచారంగా కూడా పరిశీలకులు భావిస్తున్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని.. పాలనకు కూడా వ్యతిరేకంగా ఉన్నారని.. చెప్పడం ద్వారా ప్రభుత్వాన్ని పలుచన చేసే పరిస్థితి ఏర్పడుతుంది. అటు సీమ నుంచి ఇటు ఉత్తరాంధ్ర వరకు కొంతమంది ఎమ్మెల్యేల పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్న మాట వాస్తవమే. ప్రభుత్వంలో ఉన్నప్పటికీ వారు అసంతృప్తితోనే ఉన్నారు. ఈ విషయంపై పార్టీలోనూ ప్రభుత్వంలోనూ చర్చ కూడా నడుస్తోంది. ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. బిజెపిలో ఆదినారాయణ రెడ్డి నుంచి జనసేనలో లోకం మాధవి వరకు కూడా చాలామంది అసంతృప్తితో ఉన్నారు. ఇక, టిడిపిలో ఈ సంఖ్య మరీ ఎక్కువగా ఉంది. అయితే, ఎప్పటికప్పుడు ఆయా పార్టీలు నేతలతో మాట్లాడుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితిని చక్కదిద్దుకునే దిశగా పని చేస్తున్నారు. కలివిడిగా ముందుకు సాగాలని చెబుతున్నారు. దీంతో తరచుగా వస్తున్న విభేదాలు ఒకింత సమస్యగా మారే పరిస్థితి ఏర్పడింది. కానీ, ఈ సమయంలోనే వైసీపీ ఇలాంటి నేతలను తమ వైపు ఉన్నారని చెప్పుకోవడం ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తుందన్న వాదన బలంగా వినిపిస్తోందిఇది నిజం కాదని, కొంతమందిలో అసంతృప్తి ఉన్న మాట వాస్తవమేనని అయినంత మాత్రాన వారంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నట్టు కాదని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఇక జనసేనలోనూ ఈ తరహా చర్చ నడుస్తున్నప్పటికీ ఎవరు పార్టీ వదిలేసి వెళ్లే పరిస్థితి ఉండదని చెబుతున్నారు. బిజెపిలో ఈ విషయంపై నాయకులు మౌనంగా ఉన్నారు. ముఖ్యంగా ఆదినారాయణ రెడ్డి వంటి సీనియర్ నాయకుడి వ్యవహారంలో ఎవరు మాట్లాడటం లేదు. ఇక, ఉత్తరాంధ్రలో విష్ణుకుమార్ రాజు కూడా తీవ్ర అసంతృప్తి తో ఉన్న మాట వాస్తవమే. అయినప్పటికీ ఆయన పార్టీని వదిలి వెళ్లే టైపు నాయకుడు కాకపోవడం విశేషం. మొత్తంగా చూస్తే వైసిపి చేస్తున్న ఎమ్మెల్యేల ప్రచారం కేవలం రాజకీయం కోసమేనని స్పష్టమవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.

# ఆదాయంలో విశాఖ రికార్డ్...




**విశాఖపట్టణం, మే 9, పెన్ పవర్:**
రాష్ట్ర ఆర్థిక రాజధానిగా విశాఖపట్నం సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. రూ. 1,61,009 కోట్ల జీడీపీతో విశాఖ సత్తా చాటింది. గురువారం నుంచి జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ఈ మేరకు ప్రభుత్వం నివేదిక విడుదల చేసింది. ఇందులో పలు ఆసక్తికర అంశాలు ఉన్నాయి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, జిల్లా స్థాయి పురోగతి, డేటా ఆధారిత పరిపాలన, స్వర్ణ ఆంధ్ర - 2047 దార్శనికత అమలుకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం వెల్లడించారు. స్వర్ణ ఆంధ్ర - 2047 విజన్ కింద రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించింది. 2047 నాటికి రాష్ట్ర జీఎస్డీపీని రూ. 308 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలకు చేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను అమలు చేస్తోంది. ఈ లక్ష్యాల సాధనకు మార్గదర్శకంగా “పది సూత్రాలు” మిషన్ ఫ్రేమ్‌వర్కును అమలులోకి తీసుకువచ్చారు. అభివృద్ధి పురోగతిని నిరంతరం కొలిచేందుకు 651 కీలక పనితీరు సూచికలతో కూడిన సమగ్ర డ్యాష్‌బోర్డును రూపొందించారు. ఇందులో 232 ఆర్థిక సూచికలు, 304 పాలన సూచికలు, 115 సామాజిక--సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన సూచికలు ఉన్నాయి. జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిల వరకు నెలవారీ పనితీరు నివేదికలను ప్రవేశపెట్టి, అభివృద్ధి ఫలితాలను క్రమబద్ధంగా పర్యవేక్షించే వ్యవస్థను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇక సదస్సులో 2025--26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం రూ.17.62 లక్షల కోట్ల జీఎస్డీపీతో 10.75% వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించారు. దేశ సగటుతో పోలిస్తే ఇది గణనీయమైన పురోగతిగా పేర్కొన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగం 7.83% వృద్ధిని నమోదు చేయగా, చేపల పెంపకం రంగం 19.07% వృద్ధితో అత్యుత్తమ పనితీరు కనబరిచింది. నిర్మాణ రంగం 13.05%, కమ్యూనికేషన్స్ రంగం 17.05%, బ్యాంకింగ్ ఉ భీమా రంగం 15.45% వృద్ధిని సాధించాయి. పరిశ్రమల రంగం మొత్తం మీద 9.53%, సేవల రంగం 12.94% వృద్ధిని నమోదు చేశాయి. ఈ పురోగతి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని సూచిస్తున్నదని అధికారులు వివరించారు. మరోవైపు జిల్లాల వారీగా పరిశీలిస్తే, బాపట్ల జిల్లా 19.19% వృద్ధితో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. విశాఖపట్నం జిల్లా రూ.1,61,009 కోట్ల జీడీపీతో రాష్ట్ర ఆర్థిక కేంద్రంగా నిలిచింది. తలసరి ఆదాయంలో కూడా రూ.6.58 లక్షలతో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఎన్టీఆర్, కృష్ణా, తిరుపతి, ఏలూరు జిల్లాలు కూడా మంచి ఆర్థిక పురోగతిని నమోదు చేశాయి. మరోవైపు, అన్నమయ్య జిల్లా మైనస్ 1.35% ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. దీంతో ఆ జిల్లాపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో తక్కువ తలసరి ఆదాయం నమోదవడం ప్రాంతీయ అసమానతలను సూచిస్తున్నదని అభిప్రాయం వ్యక్తమైంది.. మరో 3 పార్టీల మద్దతు ఇదే సమయంలో 2026--27 సంవత్సరానికి మరింత ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించారు. జీఎస్డీపీని రూ.20.36 లక్షల కోట్లకు పెంచి 15.53% వృద్ధి సాధించాలన్నది ప్రధాన లక్ష్యం. వ్యవసాయ, అనుబంధ రంగం 14.04%, పరిశ్రమల రంగం 17.47%, సేవల రంగం 15.80% వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపరంగాల వారీగా చూస్తే, చేపల పెంపకం రంగానికి 20.66%, నిర్మాణ రంగానికి 20.5%, మైనింగ్‌కు 18%, తయారీ రంగానికి 15.5%, వాణిజ్యం--హోటళ్లు--రెస్టారెంట్లకు 16.5%, బ్యాంకింగ్,
బీమా రంగాలకు16% వృద్ధి లక్ష్యాలను నిర్ణయించారు. తలసరి ఆదాయాన్ని రూ.2,94,507 నుంచి రూ. 3,39,404కు పెంచి 15.24% వృద్ధిని సాధించాలన్నది మరో కీలక లక్ష్యంగా పేర్కొన్నారు. 2025--26లో నమోదైన 10.75% జీఎస్డీపీ వృద్ధి రాష్ట్రానికి బలమైన ఆర్థిక పునాదిని అందించగా, 2026--27లో 15.53% వృద్ధి లక్ష్యం సాధించదగినదిగా సదస్సు విశ్వాసం వ్యక్తం చేసింది. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నెలవారీ పనితీరు ట్రాకింగ్, విలువ జోడింపు,ూ× ఆధారిత పరిపాలన, కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలు, డేటా ఆధారిత నిర్ణయ వ్యవస్థలు కలిసి స్వర్ణ ఆంధ్ర - 2047 దిశగా రాష్ట్రాన్ని స్థిరమైన, సమగ్ర, వేగవంతమైన అభివృద్ధి మార్గంలో ముందుకు నడిపిస్తున్నాయని సదస్సు స్పష్టం చేసింది.

# పిఠాపురం నుంచే బాబు స్టార్ట్... తమ్ముళ్లకు వార్నింగ్




**కాకినాడ, మే 9, పెన్ పవర్:**
పర్సనల్ ఎజెండాలు వద్దు. మీ అభిప్రాయాలు పార్టీ మీద నెట్టొద్దు. కూటమి ముఖ్యం. పార్టీకే ప్రాధాన్యం. ఇది అర్థం చేసుకుంటే బెటర్. లేకపోతే సీరియస్ యాక్షన్ ఉంటుంది. ఇక మీ ఇష్టమంటూ లీడర్లకు, క్యాడర్‌కు ఎన్నోసార్లు క్లియర్ కట్ ఇండికేషన్ ఇస్తూ వచ్చారు సీఎం చంద్రబాబు. పై స్థాయిలో పవన్‌తో తనకు మంచి రిలేషన్ ఉంది..కలిసే ఉంటాం..కలిసే నడుస్తాం ఫిక్స్ అయిపోండని కూడా చెప్పేశారు. ఎక్కడా ఎలాంటి తేడాలు రావడానికి వీల్లేదని పలుసార్లు హెచ్చరించారు కూడా. కొందరు నేతల తీరుతో కూటమి డిస్టర్బ్ అయ్యే పరిస్థితి వస్తే ఊరుకునేది లేదని చెప్పిన చంద్రబాబు..అన్నంత పని చేశారు.ఏకంగా పార్టీకి లాయలిస్ట్‌గా, సిన్సియర్ కార్యకర్తగా పేరున్న వర్మను పిఠాపురం ఇంచార్జ్ పదవి నుంచి తప్పించి షాక్ ఇచ్చారు చంద్రబాబు. ఆ్రెడీ పార్టీ కార్యవర్గ సభ్యుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో కూడా ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చి చర్చకు దారితీశారు. ఫ్లెక్సీలు, ఫెక్సీలో ఫోటో కోసం గొడవేంటి అంటూ ఇండైరెక్ట్ గా వర్మకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పుడు ఏకంగా ఆయన్ను పార్టీ ఇంచార్జ్ పదవి నుంచి తొలగించారు. అయితే తనను పిఠాపురం బాధ్యతల నుంచి తప్పించడంపై స్పందించిన వర్మ..పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. వర్మ. ఫక్తు టీడీపీ కార్యకర్త. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా..పవర్‌లో ఉన్నా..వర్మది వన్ లైన్ ఎజెండా..పార్టీ కోసం పని చేయడమే. అయితే గత ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా పిఠాపురం సీటును జనసేన చీఫ్ పవన్ కల్యాణ్‌కు ఇచ్చారు. అప్పుడే వర్మ తన అసంతృప్తిని వ్యక్తం చేయడంతో..చంద్రబాబుతో సహా లోకేశ్ సర్దిచెప్పి భవిష్యత్‌పై భరోసా ఇచ్చారు. ఫ్యూచర్‌లో ఎమ్మెల్సీ లేకపోతే మరేదైనా ఆ స్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పోస్ట్ ఇస్తామని కూడా హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్లుగానే అధిష్టానం మాటకు కట్టుబడి పవన్ కోసం ప్రచారం చేశారు వర్మ. ఆయన ఫ్యామిలీ కూడా పవన్ గెలుపు కోసం హార్ట్ ఫుల్‌గా క్యాంపెయిన్ చేసింది. ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పడ్డాక వర్మకు ఏదో ఒక పదవి ఇస్తారన్న టాక్ నడిచింది. మధ్యలో ఇద్దరు గన్‌మెన్‌లను కూడా ఇచ్చింది ప్రభుత్వం. కానీ ఇప్పటివరకు ఆయనకు ఏ పదవి దక్కలేదు. దీంతో రానురాను వర్మలో అసంతృప్తి బయటపడుతూ వచ్చింది.తనకు ఏ పదవి దక్కలేదన్న అసంతృప్తితో..ఇంటెన్షన్ వేరు..బరస్ట్ అవుతున్నది అందుకోసం కాదు అన్నట్లుగా ఎప్పుడూ ఏదో ఒక ఇష్యూతో వార్తల్లో ఉంటూ వచ్చారు. పిఠాపురంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో చంద్రబాబు ఫోటోను చిన్నగా వేశారని ఓసారి అధికారులపై సీరియస్ అయ్యారు వర్మ. మరోసారి పిఠాపురం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఫ్లెక్సీలో సీఎం ఫోటో లేదంటూ రాద్ధాంతం చేశారు. జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో మాటల యుద్ధం నడిచింది. దీంతో కూటమిలో కుతకుతలతో..పవన్ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతలకు పొసగట్లేదన్న వార్తలు హల్‌చల్ చేశాయి. ఇక ఇలా చూసుకుంటే పోతే మొదటికే మోసం వస్తుందని భావించిన సీఎం చంద్రబాబు..కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు. వర్మ పార్టీ కోసం పని చేసిన సిన్సియర్ కార్యకర్తే అయినా..ప్రస్తుత పరిస్థితుల్లో కూటమికే చంద్రబాబు ప్రయారిటీ ఇస్తున్నారన్నది ఓపెన్ సీక్రెట్ అయిపోయింది.వార్తా సేవలుఅయితే ఒక్క పిఠాపురంలోనే కాదు..రాష్ట్రంలో పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నేతల మధ్య పొసగట్లేదు. కొన్ని చోట్ల అయితే టీడీపీ ఎమ్మెల్యేలు

టంగ్ స్లిప్ అవుతూ పార్టీకి తలనొప్పులు తెచ్చుపెడుతున్న పరిస్థితి. ఇలా అన్ని గమనించిన చంద్రబాబు..పిఠాపురం నుంచే ఆపరేషన్ స్టార్ట్ చేశారన్న టాక్ వినిపిస్తోంది. వర్మ లాంటి నేతకే షాక్ ఇచ్చారనే ఇండికేషన్ ఒకటి అయితే..పవన్‌కు, కూటమికి చంద్రబాబు ఇస్తున్న ప్రయారిటీ కూడా ఎక్స్‌పోజ్ చేసినట్లు అయిందన్న చర్చ జరుగుతోంది. ఇప్పుడు పదవి నుంచి తప్పించింది వర్మనే అయినా..ఈ సెగ అందరికీ తాకేలా చేయాలన్నదే బాబు ఆలోచనగా చెప్పుకుంటున్నారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన, బీజేపీ కూడా ఇలాగే సైడ్ ట్రాక్ పడితే ఇంతే స్ట్రిక్ట్‌గా బిహేవ్ చేసేలా బాబు రూట్‌మ్యాప్ వేశారని చర్చించుకుంటున్నారు. ఏదేమైనా పిఠాపురం వర్మ విషయంలో బాబు తీసుకున్న డెసిషన్ అయితే పొలిటికల్ హాట్ టాపిక్‌గా మారింది.ు

# గంటకు 154 కి.మీ వేగం... ఐపీఎల్‌ను షేక్ చేస్తున్న యువ పేసర్ ఇతడే!

**ఐపీఎల్ 2026లో సంచలనంగా మారిన గుజరాత్ పేసర్ అశోక్ శర్మ**

**గంటకు 150 కి.మీ పైగా వేగంతో నిలకడగా బౌలింగ్**

**రాజస్థాన్‌పై 154.2 కి.మీ వేగంతో ఈ సీజన్‌లో ఫాస్టెస్ట్ బాల్ నమోదు**

**బ్రెట్ లీ, డేల్ స్టెయిన్‌ల నుంచి స్ఫూర్తి పొందినట్లు వెల్లడి**

**కోచ్ ఆశిష్ నెహ్రా మార్గదర్శకత్వంలో రాటుదేలుతున్న యువ బౌలర్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ మరో భారత యువ పేస్ బౌలర్‌ను వెలుగులోకి తెచ్చింది. గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడుతున్న 23 ఏళ్ల అశోక్ శర్మ, తన అసాధారణ వేగంతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. నిలకడగా గంటకు 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు సంధిస్తూ, ఈ టోర్నమెంట్‌లో సరికొత్త సంచలనంగా మారాడు. అతని బౌలింగ్‌లో కేవలం వేగమే కాదు, ప్రత్యర్థి బ్యాటర్లను భయపెట్టే నిర్భయమైన తత్వం కూడా కనిపిస్తోంది.

ఇటీవల రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అశోక్ శర్మ తన సత్తా ఏంటో పూర్తిస్థాయిలో చూపించాడు. ఆ జట్టు బ్యాటర్ ధ్రువ్ జురెల్‌కు సంధించిన ఓ బంతి ఏకంగా 154.2 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లింది. ఇది ఈ ఐపీఎల్ సీజన్‌లో నమోదైన అత్యంత వేగవంతమైన బంతి మాత్రమే కాదు, ఐపీఎల్ చరిత్రలోనే వేగవంతమైన బంతుల్లో ఒకటిగా నిలిచింది. ఈ ప్రదర్శనతో అతను ఒక్కసారిగా వార్తల్లో నిలిచాడు.

**చిన్ననాటి కల నిజమైంది**

చిన్నప్పుడు ఆస్ట్రేలియా దిగ్గజం బ్రెట్ లీ, దక్షిణాఫ్రికా స్టార్ డేల్ స్టెయిన్‌ల బౌలింగ్‌ను చూసి తాను కూడా వారిలాగే 150 కి.మీ. వేగంతో బంతులు వేయాలని కలలు కన్నట్లు అశోక్ శర్మ తెలిపాడు. "ఒక ఫాస్ట్ బౌలర్ కెరీర్‌లో 150 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయడం చాలా పెద్ద విషయం. ఆ మార్క్‌ను అందుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఇప్పుడు ఆ అనుభూతిని నేను పొందుతున్నాను. నా చిన్ననాటి కల నెరవేరింది. అయితే, నా వ్యక్తిగత మైలురాళ్ల కంటే జట్టును గెలిపించడమే ప్రస్తుతం నా ముందున్న లక్ష్యం" అని అశోక్ వివరించాడు.

**నెహ్రా మార్గదర్శకత్వం**

తన ప్రదర్శన వెనుక గుజరాత్ టైటాన్స్ హెడ్ కోచ్ ఆశిష్ నెహ్రా పాత్ర ఎంతో ఉందని అశోక్ శర్మ కృతజ్ఞతగా చెప్పాడు. నెహ్రా మార్గదర్శకత్వంలో తన బౌలింగ్‌లో క్రమశిక్షణ, మ్యాచ్ పరిస్థితులను అర్థం చేసుకునే నైపుణ్యం మెరుగుపడిందని తెలిపాడు. "ఫాస్ట్ బౌలర్‌గా రాణించాలంటే ముందుగా టెస్ట్ మ్యాచ్ లెంగ్త్‌పై పట్టు సాధించాలని, ఆ లెంగ్త్‌లో ఆరు బంతుల్నీ ఒకేచోట వేసే నియంత్రణ వచ్చాకే యార్కర్లు, స్లోవర్ బంతుల వంటి ఇతర అస్త్రాలను ప్రాక్టీస్ చేయాలని నెహ్రా చెప్పిన సూచన నాకెంతో ఉపయోగపడింది" అని అశోక్ వెల్లడించాడు.

**కఠినమైన ప్రయాణం... దక్కిన గుర్తింపు**

రాజస్థాన్‌కు చెందిన అశోక్ శర్మను ఐపీఎల్ 2026 వేలంలో గుజరాత్ టైటాన్స్ రూ. 90 లక్షలకు కొనుగోలు చేసింది. గతంలో కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లలో సభ్యుడిగా ఉన్నప్పటికీ, ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం కూడా రాలేదు. అయితే, పట్టువదలకుండా దేశవాళీ క్రికెట్‌లో రాణించి, 2025-26 సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 22 వికెట్లతో సత్తా చాటాడు. ఈ ప్రదర్శనే అతనికి ఐపీఎల్‌లో అసలైన అవకాశం కల్పించింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లు ఆడి 6 వికెట్లు పడగొట్టాడు. లక్నో సూపర్ జెయింట్స్‌పై 32 పరుగులకు 2 వికెట్లు తీయడం అతని అత్యుత్తమ ప్రదర్శన. అపారమైన వేగం, సరైన మార్గదర్శకత్వం తోడవడంతో అశోక్ శర్మ భారత క్రికెట్ భవిష్యత్ ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు.

# ప్లే ఆఫ్ క్లాష్.. గెలిచేదెవరు..?

## పింక్ ప్రామిస్ మ్యాచ్‌లో రాజస్థాన్ కొట్టే సిక్సులెన్ని..?








**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 లో భాగంగా మే 09 (శనివారం) రాజస్థాన్ వర్సెస్ గుజరాత్ మ్యాచ్ రసవత్తరంగా ఉండనుంది. వరుసగామూడు గెలుపులతో కాన్ఫిడెన్స్ తో దండయాత్రకు బయల్దేరింది గుజరాత్ టీమ్. అదే క్రమంలో గత ఓటములనుంచి కోలుకుని.. టాప్ 4 స్థానాన్ని పదిలం చేసుకునేందుకు సిద్ధమైంది గుజరాత్. దీంతో రెండు టీమ్స్ మధ్య వార్ గట్టిగానే నడిచేలా ఉంది. మరో విషయం ఏంటంటే.. రాజస్థాన్ రాయల్స్ కు ఇది పింక్ ప్రామిస్ మ్యాచ్. అంటే పూర్తి పింక్ కలర్ జెర్సీలతో సందడి చేయనున్నారు. ఈ థీమ్ ఉద్దేశం ఏంటంటే.. ఎన్ని సిక్సులు కొడితే అన్ని.. ఆరు రెట్లు ఇండ్లకు సోలార్ లైటింగ్ సదుపాయం కల్పించడం. అంటే ఒక్క సిక్సుకు ఆరు ఇండ్లకు సోలర్ పవర్ సౌకర్యం కల్పించనున్నారు. దీంతో రాత్రికి కొట్టే సిక్సులపై కౌంటింగ్ మామూలుగా ఉండదు.పింక్ ప్రామిస్ మ్యాచ్ ఇది మూడో ఏడు. 2026లో 260 ఇళ్లు సోలార్ తో వెలిగాయి. 2025లో సాంబార్ ప్రాంతంలోని 520 ఇండ్లకు సౌర విద్యుత్ వెలుగులు అందించారు. ఈ ఏడు అంతకు మించిన సిక్సులు పడతాయని ఊహిస్తున్నారు ఫ్యాన్స్.రాజస్థాన్ లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్ ను దెబ్బకొట్టి తమ టాప్-ఫోర్ స్థానాన్ని కాపాడుకోవాలని రాజస్థాన్ రాయల్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ 52వ మ్యాచ్‌కు ఇరు జట్లు 12 పాయింట్లతో సమంగా ఉన్నాయి. దీంతో ప్లేఆఫ్ అర్హత కోసం ఈ పోరు రసవత్తరంగా ఉండనుంది. రాజస్థాన్ ఇటీవల ఢిల్లీ చేతిలో ఓటమి చవిచూడగా, గుజరాత్.. వరుసగా మూడు మ్యాచ్‌ల విజయ పరంపరతో జైపూర్‌కు వస్తోంది. లాస్ట్ మ్యాచ్‌లో 90 రన్స్ తో వీరోచిత ఇన్నింగ్స్ ఆడిన కెప్టెన్ రియాన్ పరాగ్ ఫామ్ లోకి రావటం ఆర్‌ఆర్ కు కలిసొచ్చే అంశం. జాసన్ హోల్డర్ నేతృత్వంలోని గుజరాత్ బౌలింగ్ .. మహమ్మద్ సిరాజ్ స్పీడ్ ముందు పరాగ్ నాయకత్వానికి గట్టి పరీక్ష ఎదురుకానుంది. పవర్‌ప్లే ఓవర్లలో వేగంగా పరుగులు పిండుకోవడానికి రాయల్స్ తమ యువ ఓపెనింగ్ జోడి యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీలపై ఎక్కువగా ఆధారపడనుంది.

## ఏఎఫ్‌సీ అండర్--17 విమెన్స్ ఆసియా కప్.. చరిత్ర సృష్టించిన ఇండియా ఫుట్ బాల్ జటు



**హైదరాబాద్ పెన్ పవర్:** సుజౌ (చైనా): ఏఎఫ్‌సీ అండర్--17 విమెన్స్ ఆసియా కప్‌లో ఇండియా ఫుట్‌బాల్ జట్టు చరిత్ర సృష్టించింది. గ్రూప్--బిలో భాగంగా శుక్రవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఇండియా 4--0తో లెబనాన్‌పై గెలిచింది. ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారి క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. గ్రూప్--సిలో ఫిలిప్పీన్స్, చైనీస్‌తైపీ మధ్య జరిగిన మ్యాచ్ ఫలితం ఇండియాకు అనుకూలంగా రావడంతో నాకౌట్ బెర్త్ ఖాయమైంది. ఈ మ్యాచ్‌లో ఫిలిప్పీన్స్, చైనీస్‌తైపీలో ఏదో ఓ జట్టు ముందుకెళ్లాలంటే కనీసం 12 గోల్స్ చేయాల్సి ఉంది. కానీ రెండు జట్లూ టార్గెట్‌ను చేరుకోలేకపోయాయి.2005 తర్వాత ఈ టోర్నీలో ఇండియాకు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఇక లెబనాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇండియా తరఫున ప్రీతిక బర్మన్ (7, 85వ ని), అల్వా దేవి సెంజమ్ (36వ ని), జోయా (72వ ని) గోల్స్ చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ఇండియన్ స్ట్రయికర్లు లెబనాన్‌కు పుంజుకునే అవకాశం ఇవ్వలేదు. ఏడో నిమిషంలోనే ప్రీతిక కొట్టిన లెఫ్ట్ ఫుట్ కిక్ గోల్‌తో ఇండియా ఆధిక్యంలోకి వచ్చేసింది. తొలి హాఫ్‌లో 2--0 లీడ్‌లో నిలిచిన ఇండియా రెండో అర్ధభాగంలో మరో రెండు గోల్స్ చేసింది. ఈ టోర్నీలో ఇండియా సెమీస్‌కు చేరుకుంటుంటే 2026 ఫిఫా అండర్--17 వరల్డ్ కప్‌కు డైరెక్ట్‌గా అర్హత సాధిస్తుంది.

# రెడ్ బికినీలో బొమ్ డిగి డిగి బ్యూటీ హొయలు

**సీరత్ కపూర్ సిల్క్ చీరలో టైమ్‌లెస్ గాంభీర్యంతో స్టన్ చేసింది**





నేటి తరంలో అత్యంత వేగంగా గుర్తింపు తెచ్చుకున్న ముంబై భామల్లో సాక్షి మాలిక్ ఒకరు. కెరీర్‌ను ఒక మోడల్‌గా ప్రారంభించి.. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా అనతి కాలంలోనే విపరీతమైన ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ముఖ్యంగా బాలీవుడ్ చిత్రం -సోను కే టిటు కి స్వీటీ-లోని -బొమ్ డిగి డిగి- పాటలో కేవలం కొన్ని సెకన్ల పాటు కనిపించినా...తన అందం ఎనర్జీతో ప్రేక్షకులను కట్టిపడేసింది. ఆ ఒక్క పాటతో సాక్షి ఓవర్‌నైట్ స్టార్‌గా మారిపోయింది. ఢిల్లీకి చెందిన ఈ భామ వృత్తిరీత్యా ఇంజనీరింగ్ చదివినా గ్లామర్ రంగంపై ఉన్న మక్కువతో ముంబైకి చేరుకుని తన కలలను సాకారం చేసుకుంటోంది. తాజాగా సాక్షి మాలిక్ షేర్ చేసిన రెడ్ హాలిట్ ఫోటోషూట్ నెట్టింట మంటలు రేపుతోంది. మునుపెన్నడూ లేనంత గ్లామరస్‌గా ఈ భామ ఒక ఎర్రటి డ్రెస్ లో మెరిసిపోయింది. ఈ రెడ్ హాట్ ఫ్రాకులో సాక్షి ఒలికించిన హొయలు యువత మతులు చెడగొడుతున్నాయి. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ తన అభిమానులకు టచ్‌లో ఉండే ఈ బ్యూటీ ఈ లేటెస్ట్ గ్లామర్ పిక్స్‌తో ఇంటర్నెట్‌లో మరోసారి వైరల్ అయ్యింది. సాక్షి ఫిట్‌నెస్.. స్టైలిష్ లుక్‌ను చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

అయితే సాక్షి మాలిక్ నటనా కెరీర్ ఆశించిన స్థాయిలో పుంజుకోకపోవడం వెనుక కొన్ని ఆసక్తికరమైన కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా సౌత్ సినిమాల్లో మాలిక్ కు చేదు అనుభవం ఎదురైంది. టాలీవుడ్‌లో నాని నటించిన ఎ చిత్రం విడుదలైప్పుడు.. సాక్షికి తెలియకుండానే తన ఫోటోను సినిమాలో అభ్యంతరకర రీతిలో వాడటం పెద్ద వివాదానికి దారితీసింది. దీనిపై చట్టపరమైన పోరాటం చేసి గెలిచినా ఆ అనూహ్య పరిస్థితుల వల్ల సాక్షి టాలీవుడ్ ప్రాజెక్టులకు దూరంగా ఉండాల్సి వచ్చింది. సరైన కథలు తన పాత్రకు ప్రాధాన్యత ఉన్న సినిమాల కోసం వేచి చూడటం వల్ల సాక్షి సౌత్ కెరీర్ ప్రస్తుతం కొంత నెమ్మదిగా సాగుతోంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ విషయానికి వస్తే... సాక్షి మాలిక్ వెబ్ సిరీస్‌లపై కూడా దృష్టి పెడుతోంది. ఇప్పటికే కొన్ని ప్రైవేట్ మ్యూజిక్ ఆల్బమ్స్.. యాడ్ ఫిలిమ్స్‌లో మెరిసిన ఈ భామ తదుపరి ఏవైనా భారీ వెబ్ సిరీస్‌లలో నటించబోతోందా అనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం తన నటనలోని నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుంటూ ఓటిటి వేదికలపైకి రావడానికి ఆసక్తి చూపుతోంది. గ్లామర్ ఇమేజ్ నుండి బయటకు వచ్చి నటిగా నిరూపించుకునే అవకాశం ఉన్న సిరీస్‌ల కోసం సాక్షి చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. సాక్షి మాలిక్ 2026 కెరీర్ ప్లాన్స్ గురించి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు అందుతున్న సమాచారం ప్రకారం.. 2026లో కొన్ని కొత్త సినిమాల ఆడిషన్లలో పాల్గొంటోంది. పెద్ద బ్యానర్లలో అవకాశాల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కేవలం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గానే కాకుండా... వెండితెరపై ఒక పూర్తిస్థాయి నటిగా తనదైన ముద్ర వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2026లో సాక్షికి సంబంధించి కొన్ని క్రేజీ ప్రాజెక్టుల వివరాలు అధికారికంగా వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ లోపు తన గ్లామర్ ఫోటోషూట్లతో ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది ఈ బొమ్ డిగి డిగి బ్యూటీ.

**సాక్షి మాలిక్ అద్భుతమైన గ్లామరస్ లుక్‌లో తలదాచుకుంది**



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965